www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 15 | శనివారం | 15 ఆగస్టు, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169



పంద్రాగస్టు సందర్భంగా విద్యుద్దీపకాంతులతో వెలిగిపోతున్న గోల్కొండ కోట



# వికసిత్ భారత్ లక్ష్యంగా..

## ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్

- జాతీయ భద్రతకు బలమైన పునాదిగా ఆత్మనిర్భర్ భారత్ అభియాన్
- 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయటపడ్డారు
- బ్యాంకింగ్ వ్యవస్థలోకి 59 కోట్ల మంది.. వీరిలో 32 కోట్ల మందికి పైగా మహిళలే
- 80 కోట్ల మందికి పైగా ప్రజలకు ఉచిత రేషన్ • విద్యార్థులే దేశ భవిష్యత్తు నిర్మాతలు
- దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే • యువతకు స్వయం ఉపాధి, స్టార్టప్‌లలో అవకాశాలు
- పేపర్ లీకేజీలకు చరమగీతం • ఉగ్రవాదంపై 'ఆపరేషన్ సిందూర్'తో సత్తా చాటింది
- 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ:** 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోందని, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ ఆర్థిక పురోగతి, జాతీయ భద్రతకు బలమైన పునాదిగా మారిందని చెప్పారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందికి పైగా పేదరికం నుంచి బయటపడ్డారని, ప్రధాన్‌మంత్రి జన్‌ధన్ యోజన ద్వారా 59 కోట్ల మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారని తెలిపారు. వీరిలో 32 కోట్ల మందికి పైగా మహిళలేనన్నారు. 80 కోట్ల మందికి పైగా ప్రజలకు ఉచిత రేషన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు: పేపర్ లీకేజీలు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు చేపడుతున్నామని ముర్ము తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమన్నారు. దేశ జనాభాలో 65శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, యువతే దేశానికి విలువైన ఆస్తి అని పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి, వ్యాపారాల వైపు అడుగులు వేస్తోందని, స్టార్టప్ వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. 'ఖేలో ఇండియా' ద్వారా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

### మన సామర్థ్యం ప్రపంచానికి చాటాం

'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రవాదంపై కచ్చితమైన దాడులు నిర్వహించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రపంచానికి చాటిందన్నారు. ఉగ్రవాదులు, వారికి మద్దతిచ్చేవారు ఎక్కడున్నా పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం రైతుల ప్రయోజనాల దృష్ట్యా కీలక నిర్ణయమన్నారు. నక్సలిజాన్ని నిర్మూలించడం గొప్ప విజయమని, ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, ఉత్సాహం తరువాయి 2లో..

### విభజన విషాదాలను మరువొద్దు

- బాధితుల త్యాగాలను స్మరించుకున్న ప్రధాని మోదీ



6

### పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి 301 శౌర్య పతకాలు

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటన
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల సిబ్బందికి 197 పతకాలు
- మొత్తం 1,057 మందికి పతకాలతో సత్కారం

6




### స్వాతంత్ర్య దినోత్సవ వేళ బాంబు బెదిరింపులు

- ఢిల్లీ హైకోర్టు, విమానాశ్రయానికి బెదిరింపు మెయిల్స్
- ఖలిస్థాన్ పేరిట సందేశాలు
- అప్రమత్తమైన భద్రతా బలగాలు
- ఆయా ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు

6

• పెట్టుబడులే లక్ష్యం..

## ఇన్వెస్ట్ తెలంగాణకు గ్రీన్‌సిగ్నల్




- డిసెంబర్ 7 నుంచి 9 వరకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0
- డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులకు ప్రత్యేక ప్రాధాన్యం
- ఈవీ ఆటోలకు రూ.200 కోట్ల పథకం • ఎత్తిపోతల పథకానికి రూ.2,100 కోట్లు
- కొత్త ఆవిష్కరణలతో ప్రత్యేక ప్రదర్శనలు
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2

# చదువే తలరాత మార్చే ఆయుధం

## విద్యతోనే ఆత్మగౌరవం.. గుర్తింపు.. సామాజిక మార్పు

- నైపుణ్యాలతో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు • ఇకనుంచి ముందుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల జమ
- బీసీ జనగణనతో బలహీన వర్గాలకు అవకాశాలు • పూలే దంపతుల స్ఫూర్తితో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు: సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** చదువు ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని, విద్యతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సుమారు 150 ఏళ్ల క్రితమే మహాత్మా జ్యోతిబా పూలే చదువే అభివృద్ధికి ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతోపాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఒకే ప్రాంతంలో ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్‌రెడ్డి అన్నారు. పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతుందని చెప్పారు. ప్రజాపాలనలో పూలే ఆశయాలను కొనసాగిస్తున్నామని, కుల నిర్మూలన, సామాజిక చైతన్యం కోసం అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకునే, జీవించే వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు.

### నర్సరీ నుంచే విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు అవసరమైన తరువాయి 2లో..



### జనగణనలో కులం వివరాలు

- 40 ప్రశ్నలతో జనగణన–2027 ప్రశ్నావళి నోటిఫికేషన్
- ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంకు ఖాతాల వివరాలూ నమోదు
- పూర్తిగా డిజిటల్ విధానంలో దేశవ్యాప్తంగా ప్రక్రియ

6



### అంతా నిబంధనలకు విరుద్ధమే

- సీఎం కుటుంబసభ్యుల పాత్రపై విచారణ జరపాలి
- రూ.200 కోట్ల విలువైన భూములను అప్పనంగా కేటాయించారు
- భూ కేటాయింపులను రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- టెస్సెరాక్ట్ భూ కేటాయింపులపై లోకాయుక్తకు బీఆర్ఎస్ ఫిర్యాదు

2

### రాష్ట్ర పోలీసులకు 15 రాష్ట్రపతి పతకాలు

- విధి నిర్వహణలో ధైర్యసాహసాలు, విశిష్ట సేవలకు గుర్తింపు
- ముగ్గురికి గ్యాలంట్రీ మెడల్స్.. ఇద్దరికి విశిష్ట సేవా పతకాలు
- మరో 10మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్

2

# అంతా నిబంధనలకు విరుద్ధమే

- సీఎం కుటుంబ సభ్యుల పాత్రపై విచారణ జరపాలి
- రూ.200 కోట్ల విలువైన భూములను అప్పనంగా కేటాయించారు
- భూ కేటాయింపులను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- టెస్సెరాక్ట్ భూ కేటాయింపులపై లోకాయుక్తకు బీఆర్ఎస్ ఫిర్యాదు

**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ కుంభ కోణంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు శుక్రవారం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు లోకాయుక్త జస్టిస్ ఏ. రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. టెస్సెరాక్ట్ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయింపు జరిగిందని, ఇందులో సీఎం కుటుంబ సభ్యుల పాత్రపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే టెస్సెరాక్ట్ సంస్థకు కేటాయించారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఆ భూమి విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఏరోస్పేస్ సంస్థగా పేర్కొంటున్న టెస్సెరాక్ట్ చెల్లించిన మూలధనం కేవలం రూ.లక్షే నని, కంపెనీ అధికారిక బోర్డు నివేదికలో ఉద్యోగుల సంఖ్య 'సున్నా'గా ఉందని ఆరోపించారు. నివాస చిరునామాతో నడుస్తున్న సంస్థకు ఇంత విలువైన ప్రభుత్వ భూములను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. టెస్సెరాక్ట్ సంస్థకు సంబంధించిన వివరాల్లో సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి చైర్మన్‌గా, మేనల్లుడు నయన్‌రెడ్డి సీఈవోగా ఉన్నట్లు ఆధారాలను లోకాయుక్తకు సమర్పించామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశ్నలు లేవనెత్తిన తర్వాత సంస్థ వెబ్‌సైట్‌లోని వివరాలను రాత్రికి రాత్రే మార్చారని ఆరోపించారు. రికార్డుల్లో కొండల్‌రెడ్డి పేరు లేకుండా బినామీలను తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు.

## మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ అధికారులపైనా..

టెస్సెరాక్ట్ భూ కేటాయింపులను వెంటనే నిలిపివేసి రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాత్రపై విచారణ జరిపి నివేదికను గవర్నర్‌కు పంపాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ అధికారులపై అవినీతి నిరోధక చట్టం, బీఎన్ఎస్ నిబంధనల కింద విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కర్నాటకలోని ముడా తరహాలోనే తెలంగాణలో టెస్సెరాక్ట్ భూ వ్యవహారం సాగుతోందని వారు ఆరోపించారు.

# పెట్టుబడులే లక్ష్యం.. ఇన్వెస్ట్ తెలంగాణకు గ్రీన్‌సిగ్నల్

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సును నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ఆవిష్కరించడంతోపాటు డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. రాష్ట్ర స్టార్టప్‌లు, పరిశ్రమల విజయాలు, కొత్త ఆవిష్కరణలతో ప్రత్యేక స్టాళ్లు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమ్మిట్ నిర్వహణకు ప్రత్యేక కమిటీలతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు

హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులకు స్థలాల కేటాయింపును వేగవంతం చేయాలని కేబినెట్ ఆదేశించింది. రాష్ట్రంలో కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులు జారీ చేయడంతో లబ్ధిదారుల సంఖ్య 3.42 కోట్లకు చేరిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్మార్ట్ కార్డుల పంపిణీని ఘనంగా చేపట్టనున్నారు. ఇక ఏడు రకాల సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించి, ఈ ఏడాది నుంచి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీలు, రైతు వేదికల ద్వారా ప్రచారం చేపట్టనున్నారు. ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ఎత్తిపోతలకు రూ.2,100 కోట్లు

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం రెండో దశకు రూ.2,100 కోట్లకు ఆమోదం లభించింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు, సోలార్ విద్యుత్‌పై అధ్యయనానికి కన్సల్టెంట్ నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

### 86 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు అనుమతి

ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాకలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. వీటితో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు లభించాయి. తొలివిడతలో 113 నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనున్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లోని 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.200 కోట్ల పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. అర్హులైన డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించారు.

# తెలంగాణ పోలీసులకు 15 రాష్ట్రపతి పతకాలు

- విధి నిర్వహణలో ధైర్యసాహసాలు, విశిష్ట సేవలకు గుర్తింపు
- ముగ్గురికి గ్యాలంట్రీ మెడల్స్.. ఇద్దరికి విశిష్ట సేవా పతకాలు
- మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్

**ప్రజానావ, హైదరాబాద్:** 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు, అంకితభావం, అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించింది. వీటిలో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ఉన్నాయి. విధి నిర్వహణలో అసాధారణ ధైర్యసాహసాలు, తెగువ ప్రదర్శించిన తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలను గ్యాలంట్రీ మెడల్స్‌కు ఎంపిక చేశారు. బి. సత్యారావు, సందీప్‌కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వర్తించిన తీరుకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారాలు లభించాయి. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ప్రదానం చేసే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. వారి నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో ఈ ఏడాది తెలంగాణ పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# ఇక రేషన్ స్మార్ట్!

- లబ్ధిదారులకు పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- సంగారెడ్డిలో నేడు సీఎం రేవంత్ చేతులమీదుగా శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు




**ప్రజానావ, సంగారెడ్డి:** తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. ఇప్పటివరకు జిరాక్స్ కాగితాలపైనే కొనసాగుతున్న రేషన్ కార్డుల స్థానంలో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శనివారం శ్రీకారం చుట్టనుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు కార్డులను అందజేయనున్నారు. ఇందుకోసం సంగారెడ్డిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

## 12 ఏళ్ల నిరీక్షణకు తెర

తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తూనే ఉన్నారు. గతంలో జారీ చేసిన కార్డులు అందుబాటులో లేకపోవడంతో 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలనే లబ్ధిదారులు రేషన్ కార్డులుగా వినియోగించారు. అవి చినిగిపోవడం, పాడవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం పీవీసీ స్మార్ట్ కార్డులను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే ముద్రణ పూర్తయిన కార్డులను పంపిణీకి సిద్ధంగా ఉంచారు.

## చిప్, బార్‌కోడ్‌తో భద్రత

ఏటీఎం, పాన్‌కార్డుల తరహాలో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించారు. కార్డులో చిప్, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి సాంకేతికతను పొందుపరిచారు. కార్డును స్కాన్ చేయగానే కుటుంబ సభ్యుల వివరాలు అందుబాటు లోకి వస్తాయి. ఆధునిక భద్రతా ఫీచర్లతో రూపొందించినందున కార్డులను డూప్లికేట్ చేయడం, ట్యాంపరింగ్ చేయడం కష్టతరం కానుంది. ప్రస్తుతం బయోమెట్రిక్ విధానంలో రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేస్తున్నారు. స్మార్ట్ కార్డుల ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనైనా లబ్ధిదారులు సరుకులు పొందే అవకాశం మరింత సులభతరం కానుంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచడంతో పాటు లబ్ధిదారులకు ఇబ్బందులు తగ్గనున్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులు తమ పాత కార్డును రేషన్ దుకాణంలో చూపించి స్మార్ట్ కార్డును పొందవచ్చు. అలాగే టీఎస్ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ఉంటాయి. వెనుక భాగంలో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు అవసరమైన ఇతర సమాచారాన్ని ముద్రించారు.

## గతంలో రెండు రకాల కార్డులు

గతంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు తెలుపు రంగు రేషన్ కార్డులు, ఎగువన ఉన్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ కార్డుదారులకు బియ్యంతో పాటు ఇతర సరుకులు కూడా పంపిణీ చేసేవారు. అయితే రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి మాత్రమే వ్యవస్థ పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది.

# కరూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

- హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు

**న్యూఢిల్లీ :** కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ సులో జస్టిస్ జేబీ పార్ధీవాలా, జస్టిస్ వినోద్‌లతో డిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒ ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు పూరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీ అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ సులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

# భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు

**ఆపరేషన్ సిందూర్ ఇంటర్వ్యూలో అజిత్ దోభాల్**



**న్యూఢిల్లీ :** భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహాల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పరిస్థితు లపై అజిత్ డోభాల్ ఈ డ్యాసిరీస్లో పలు కీలక వివరా లను వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ డోభాల్ తెలిపారు. పహాల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్‌తో పంపామని చెప్పారు. 'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్కైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు. డోభాల్‌తో పాటు ఈ ఆపరేషన్ వెనకున్న పలువురు అధికారులు తమ అనుభవాలను ఈ డాక్యుమెంటరీలో వెల్లడించారు. శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీలో, డిస్కవరీ ఓటీటీ ప్లాట్‌ఫావ్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్‌లోని పహాల్గాంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా భారత్ గతేడాది మే7న ఆపరేషన్ సిందూర్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో పలు ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తరువాత 88 గంటల పాటు ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. మే 10న పాక్ ప్రతిపాదించిన కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది.

# వికసిత్ భారత్ లక్ష్యంగా..

(మొదటిపేజీ తరువాయి)

నెలకొన్నాయని చెప్పారు. ఇక ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక వసతులను భారత్ అభివృద్ధి చేసిందని ముర్ము తెలిపారు. మూడు కోట్ల 'లఖ్‌పతి దీదీ'ల లక్ష్యాన్ని సాధించామని, మరో మూడు కోట్ల మందిని లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 'నారీ శక్తి వందన్ అధినియమ్' ద్వారా లోక్‌సభ, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ప్రజాస్వామ్యాన్ని మరింత సమ్మిళితం చేస్తుందని పేర్కొన్నారు.

## సారనాథ్‌కు యునెస్కో జాబితాలో చోటు

సారనాథ్‌కు ఈ ఏడాది యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు లభించిందని, గత ఏడాది 12 మరాఠా సైనిక కోటలకు గుర్తింపు లభించిందని తెలిపారు. శాంతి, సంభాషణ, సహకారం, 'వసుధైవ కుటుంబకం' భారత విదేశాంగ విధానానికి పునాదులని చెప్పారు. 70 ఏళ్లు పైబడిన దాదాపు ఆరు కోట్ల మంది వృద్ధులకు ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందే అవకాశం ఉందన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమష్టి కృషితోనే లక్ష్యం: మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు రాష్ట్రపతి నివాళులర్పించారు. దేశ విభజన బాధితులను స్మరించారు. గురజాడ అప్పారావు 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అన్న భావాన్ని గుర్తుచేస్తూ.. 2047 నాటికి భారత్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు తనవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేళ బాంబు బెదిరింపులు

- ఢిల్లీ హైకోర్టు, విమానాశ్రయానికి బెదిరింపు మెయిల్స్
- ఖలిస్థాన్ పేరిట సందేశాలు
- అప్రమత్తమైన భద్రతా బలగాలు

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం రేపాయి. ఢిల్లీ హైకోర్టు, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం బెదిరింపు సందేశాలు వచ్చినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఖలిస్థాన్ పేరిట ఈ మెయిల్స్ పంపినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ హైకోర్టులో శనివారం మధ్యాహ్నం 2.11 గంటలకు బాంబు పేలుతుందని, అనంతరం దిగువ కోర్టుల్లోనూ పేలుళ్లు జరుగుతాయని మెయిల్‌లో హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు. ఖలిస్థానీ వేర్పాటువాదులు ఇప్పటికే రాజధానికి చేరుకున్నారని అందులో పేర్కొన్నట్లు వెల్లడించారు. జామ్‌నగర్ హౌస్, ఝండేవాలన్ బిల్డింగ్, సాకేత్ కార్యాలయం, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం, విమానాశ్రయంలోని టెర్మినల్–3, ఢిల్లీ మెట్రో, అంబాలా వెళ్లే రైళ్లను కూడా బెదిరింపు సందేశంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

## విస్తృతంగా తనిఖీలు

స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఢిల్లీలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. బెదిరింపు మెయిల్స్ నేపథ్యంలో భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. సందేశంలో పేర్కొన్న ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

# స్మార్ట్ రేషన్ కార్డులపై మోదీ ఫోటో పెట్టాలి

- అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్

**న్యూఢిల్లీ :** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. ఒద్రమే అధిక మొత్తంలో బియ్యం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు ఒద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించా రు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, మంత్రి ఉత్తవ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షే పించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డా రు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపె ట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశా రు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు.

# చదువే తలరాత మార్చే ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతోపాటు నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సర్టిఫికెట్ లేదా డిగ్రీ ఉద్యోగానికి సరిపోదని, నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థ సహకారంతో 119 నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందిస్తున్నామని చెప్పారు.

## నెల రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్

ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను పారదర్శకంగా అమలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందుగానే జమ చేసే విధానాన్ని ఈ ఏడాది నుంచే అమల్లోకి తెచ్చామని చెప్పారు. కళాశాలలో ప్రవేశం పొందిన తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లో ఫీజు నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే మార్కులు, డిగ్రీలతోపాటు నైపుణ్యాలు కూడా అవసరమని సీఎం అన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖత్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. పతకాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాల తోపాటు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదేనన్నారు.

## బీసీ జనగణన చారిత్రక నిర్ణయం

బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా ఎంత ఉందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీ జనగణన చేపట్టి ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనను కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు వ్యతిరేకించారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ సమస్యను కూడా పరిష్కరించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బీసీలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని సూచించిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు.

### తెలంగాణకు విద్యే బాట

'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. వారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. 'బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు' అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అందించాలని, ప్రభుత్వాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు సీఎం సానుకూలత

- మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



**ప్రజానావ, హైదరాబాద్:** ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ యోధుడు, ప్రజా నాయకుడు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు ముఖ్యమంత్రిని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ సామాజిక వర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ–డీ కేటగిరీ నుంచి బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముదిరాజ్ సంఘం నాయకుల విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పండుగ సాయన్న జయంతి అధికారిక నిర్వహణతో పాటు ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ–ఏ కేటగిరీలోకి మార్చే అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఆ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో
# వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- దేశ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**ప్రజానావ, హైదరాబాద్:** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, ధైర్యసాహసాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భారత్‌ను మరింత బలమైన, స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా శాంతి, సౌభ్రాతృత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఐక్యత, సమగ్రత, అభివృద్ధి స్ఫూర్తితో ఉజ్వల భారతావని నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. దేశ ప్రగతిలో యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు చురుకైన పాత్ర పోషించాలని గవర్నర్ కోరారు. త్రివర్ణ పతాకం ఎల్లప్పుడూ గర్వంగా రెపరెపలాడాలని, దాని మూడు రంగులు దేశ ప్రజల్లో ధైర్యం, శాంతి, విశ్వాసానికి ప్రతీకలుగా నిలవాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.




# విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ హైస్కూల్ (వాసవి సేవా కేంద్రం)లో విద్యార్థులకు పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ పి. విజయరెడ్డి పాల్గొని విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఫౌండేషన్ తరఫున కార్యక్రమాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిరిసిల్లలో తొలి సాదాబైనామా కేసు ఆమోదం

**ఇది తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో చరిత్ర మైలురాయిగా నిలిచింది**

**ప్రజానావ, సిరిసిల్ల :** సాదాబైనామా ద్వారా జరిగిన భూ లావాదేవీల క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోనే తొలి సాదాబైనామా కేసు నితంగళ్లపల్లి మండలంలోని తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఆమోదం పొందడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాదా బైనామా కేసులను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు భూ హక్కుల క్రమబద్ధీకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో తొలి కేసు ఆమోదం పొందడం సంతోషకరమైన పరిణామమని, అర్హత కలిగిన మరిన్ని సాదాబైనామా కేసులు ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు అర్హులైన అన్ని కేసులను ఎటువంటి జాప్యం లేకుండా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాగంగా లబ్దిదారుడైన ఇటికాల శంకర్ కు తంగళ్ళపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో గల 5 సర్వే నెంబర్ లో గల 0.30 గుంట ల భూమికి సంబందించిన 13(బి) ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తంగళ్లపల్లి తహసీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామం, వార్డులో తాగునీటి
# సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో తాగునీటి సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి
- తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
- పెద్దపల్లి ఐడీఓసీలో తాగునీటి సమస్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరా, సమస్యలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామం, ప్రతి వార్డులో తాగునీటికి సంబంధించిన సమస్యలను గుర్తించాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన చర్యలకు సంబంధించిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు.

### తాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి

ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి నాణ్యతలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, వార్డుల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, తాగునీటికి సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణచందర్, ఏఈ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ ఉద్యమంపై
# విషప్రచారం మానుకోవాలి

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పునరుద్ధరణ బాధ్యత కేంద్రానిదే
- తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటు
- సాధన కమిటీ కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ



**ప్రజానావ, ఆదిలాబాద్:** సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమ పునరుద్ధరణ కోసం కొనసాగుతున్న ప్రజా ఉద్యమంపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు విషప్రచారం చేయడం మానుకోవాలని సీసీఐ సాధన కమిటీ కో–కన్వీనర్ విజ్జగిరి నారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమ పునరుద్ధరణ కోసం సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో వినూత్న నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి రాజకీయ పార్టీల తీరును నిరసించారు. అంతకు ముందు అంకోలి గ్రామానికి చెందిన నాయకులు దీక్షలో కూర్చోగా, వారికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్జగిరి నారాయణ మాట్లాడుతూ ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ కోసం నిజాయితీగా సాగుతున్న ప్రజా ఉద్యమానికి సహకరించకుండా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అని, దాని పునరుద్ధరణ బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ విషయంపై కనీస అవగాహన లేకుండా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రస్తుతం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి జోగు రామన్నపై, అలాగే సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ కోసం జరుగుతున్న ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు సమర్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకోలి గ్రామానికి చెందిన ఆడే కిరణ్, రాహుల్, కనక రమణ, గంగయ్య, చందాల రాజన్నతో పాటు సీసీఐ సాధన కమిటీ కో–కన్వీనర్లు కొండ రమేష్, బండి దత్త్రాత్రి, పోశెట్టి, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- అధికారులు అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ప్రజానావ, ములుగు:** ఈ నెల 16న ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పురోగతిపై జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది డ్యూటీ పాసులు, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. మేడారం వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, నూతన కలెక్టరేట్, పైలాన్, గట్టమ్మ ఆలయ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడారంలో వనదేవతల దర్శనం, తులాభారం, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలతో పాటు నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం, సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి అధికారికి అప్పగించిన బాధ్యతలపై పూర్తి అవగాహన ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్. మహేందర్ జి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో రవికుమార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్పొరేట్ భవనాలపై
# 1.23 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు



**ప్రజానావ, కొత్తగూడెం :** సింగరేణి కాలరీస్ సంస్థ పర్యావరణహిత ఇంధన ఉత్పత్తికి మరింత ప్రాధాన్యత ఇస్తోందని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాశ్ జ్యోతి తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ పరిధిలోని సంస్థ భవనాలపై ఏర్పాటు చేసిన 1.23 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను శుక్రవారం ఆయన ప్రారంభించి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎండీ మాట్లాడుతూ.. సింగరేణి అంటే బొగ్గు ఉత్పత్తి చేసే సంస్థగా చాలా కాలంగా గుర్తింపు ఉన్నప్పటికీ, ప్రస్తుతం చేపడుతున్న వ్యాపార విస్తరణ చర్యలతో థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ రంగాల్లోనూ సంస్థ తనదైన ముద్ర వేస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బొగ్గు, థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో పాటు సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఇప్పటివరకు 245.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చేందుకు భవిష్యత్తులో మరిన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సింగరేణి సంస్థకు చెందిన భవనాలపై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని, అందులో భాగంగానే కార్పొరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన 1.23 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీఎండీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ&ఎం) ఎం. తిరుమలరావు, జీఎం (కోఆర్డినేషన్) తాడబోయిన శ్రీనివాస్, జీఎం (సీపీ&పీ) ఎ. మనోహర్, జీఎం (ఈ&ఎం వర్క్‌షాప్ & ఎనర్జీ మేనేజ్‌మెంట్) కె. శ్రీనివాసులు, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్.వి. రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి. త్యాగరాజన్, కార్పొరేట్ సీఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్, 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి నర్సింగరావు ఆదేశాల మేరకు శుక్రవారం బీజేఆర్ నగర్ సమైక్య–1లో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ కమిటీ సభ్యులు నడిమింటి కృష్ణ, డా.నరసింహ, దామోదర్, వార్డు మాజీ మెంబర్ రాములమ్మ, సమైక్య అధ్యక్షురాలు వి. ధనమ్మ, కార్యదర్శి జి. పద్మ, కోశాధికారి పి. సరస్వతి, ఉపాధ్యక్షురాలు ఎం. శంకరమ్మ, ఉప కార్యదర్శి ఎన్. కవిత, రిసోర్స్ పర్సన్ యు. వరలక్ష్మి పాల్గొన్నారు.

# మోదీ విధానాలపై సమరం.. నాట్లు వేసిన సీపీఐ నేతలు

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ చేపట్టిన 'ప్రజా చైతన్య యాత్ర' శుక్రవారంతో ముగిసింది. రేవల్లి మండలం తలుపునూరు, తలుపునూరు తండాల్లో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు కృష్ణవేణి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు జయమ్మ నేరుగా పొలాల్లోకి దిగి రైతుకూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. రూ.1000 లోపు ఉన్న డీఏపీ బస్తా ధరను మోదీ ప్రభుత్వం రూ.2,300కు పెంచి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా మోసం చేస్తోందని మండిపడ్డారు. గోపాల్‌పేటలో జరిగిన ముగింపు కార్యక్రమంలో సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరలు పెంచి సామాన్యులపై భారం మోపారని, లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులను కాలరాశారని విమర్శించారు. మోదీ పాలనకు స్వస్తి చెప్పేందుకు పేదలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకటమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సకాలంలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న దాడులు, అట్రాసిటీస్ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు అందుతున్న పరిహారం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించి ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు వారి హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు అట్రాసిటీస్ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవి తేజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, బాన్సువాడ, ఎల్లారెడ్డి డీఎస్పీలు, డీఎస్పీ డీసీఆర్బీ కామారెడ్డి, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పి. వెంకటేష్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధికార, అనధికార సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీవాసుల రక్షణకు సీసీ కెమెరాలు నిఘా

**పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి**

**ప్రజానావ, పెద్దపల్లి :** కాలనీవాసుల రక్షణకు సీసీ కెమెరాల నిఘా ఎంతో అవసరం అన్నారు. పదవ వార్డ్ కౌన్సిలర్ అక్క పెల్లి సుజాత క్రాంతి సహకారంతో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలు డిసిపి రామ్ రెడ్డి పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లక్ష్మీ నగర్ కాలనీ సొసైటీ ద్వారా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనియమ న్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు రక్షణ కవచంగా ఉంటుందని అన్నారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని సూచించారు. అనంతరం పెద్దపల్లి ఏసిపి కృష్ణ పుట్టినరోజు సందర్భంగా పదవ వార్డు కౌన్సిలర్, లక్ష్మీ నగర్ హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏసిపి తో కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ అక్కేపల్లి సుజాత క్రాంతి కుమార్ లతోపాటు డిసిపి, ఏసిపి, సీఐ, ఎస్సైలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు నరేష్ లు, పోలీస్ సిబ్బంది లక్ష్మీ నగర్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బెస్ట్ సైకాలజిస్ట్ ఆఫ్ ది ఇయర్
# అవార్డు అందుకున్న పున్నంచందర్



**ప్రజానావ, సిరిసిల్ల :** సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమంలో సైకాలజిస్ట్ కె. పున్నంచందర్‌కు "బెస్ట్ సైకాలజిస్ట్ ఆఫ్ ది ఇయర్" అవార్డు లభించింది. మానసిక ఆరోగ్య రంగంలో అందిస్తున్న సేవలు, కౌన్సెలింగ్ ద్వారా చేనేత, పవర్ లూమ్ కార్మికుల ఆత్మహత్యల నివారణ కోసం గత 16 సంవత్సరాలు గా చేస్తున్న కృషిని అభినందిస్తూ ప్రజలకు చేస్తున్న అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హ్యూమన్ రైట్స్ కౌన్సెల్ సంస్థ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయకుమార్, జాతీయ ఎస్సి కమిషన్ మాజీ సభ్యులు కె. రాములు, విమెన్ సేఫ్టీ తెలంగాణ వింగ్ సురేఖ చేతుల మీదుగా పున్నంచందర్ అవార్డును అందుకున్నారు. అదేవిధం గా హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో విశేషమైన సామాజిక సేవలు అందిస్తున్న అలువాల ఈశ్వర్‌కు బెస్ట్ నేషనల్ సోషల్ సర్వీస్ అవార్డును అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు సేవ చేస్తున్న గడ్డం దినకర్‌కు మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో అవార్డును ప్రదానం చేశారు. ఈ సంద ర్భంగా తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రామచందర్ తో పాటు పలు సంఘాల ప్రతినిధులు, సభ్యులు పున్నంచందర్, అలువాల ఈశ్వర్, గడ్డం దినకర్‌లను అభినందిం చారు. మానసిక ఆరోగ్యం, సామాజిక సేవ, గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ముగ్గురికి ఒకే వేదికపై అవార్డులు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం!

స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామ న్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. ఓ రకంగా ఆగస్ట్ 14, 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడు పోసుకుంటోందన్న సంబురాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్ర్యం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం.. కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. వలం కంటివూద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది.

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల వూద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14, 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడు పోసుకుంటోందన్న సంబురాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం.. కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. వలం కంటివూద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయ వాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశక రమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వ తంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందు ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతం త్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి వలం భారత్‌ను చీల్చ డానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించు కోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒ రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటల ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త వలం పత్రికల పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి వలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణా ర్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నా యి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16–18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్ల ముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్ర యులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకో లేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన వలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయక త్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్ర యులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకో లేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన వలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయక త్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

EDITORIAL

## యాదాద్రి అభివృద్ధికి కీలక నిర్ణయాలు

- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం
- దీక్షాపరుల మండపం, నిత్యకల్యాణ మండపం, వేదపాఠశాల నిర్మాణానికి నిర్ణయం

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ట్రస్ట్ బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రెసిడెన్షియల్ సూట్‌లో ఈవో జె. భవానీ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రస్ట్ బోర్డు సమావేశంలో చైర్మన్ ఎం. సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొని ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆలయంలో నూతన దీక్షాపరుల మండపం, నిత్యకల్యాణ మండపం, వేదపాఠశాల నిర్మాణం చేపట్టడంతో పాటు రాయిగిరి సమీపంలో ఆర్చ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 1,500 మందికి అందిస్తున్న అన్నప్రసాదాన్ని 2,000 మందికి పెంచాలని ప్రతిపాదించారు. ఆలయంలోని అన్ని రకాల సేవలను సాంకేతిక విధానంతో అనుసంధానం చేసి భక్తులకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. దేవస్థానం గదుల వద్ద కల్యాణకట్ట నిర్మాణం, శంకు–చక్ర నామాల ఏర్పాటు, దేవస్థానానికి సొంత సోలార్ వ్యవస్థ ఏర్పాటు, మెట్ల మార్గంలో పైకప్పు నిర్మాణం తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కొణిదెల సురేఖ, చిలప్పగారి విజయరాజం, విజయేందర్ తుల్లా, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, ఎం. రాఘవేందర్‌రావు, డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, స్థానాచార్యులు కందూరి వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిగాచి ప్రమాద బాధితులకు సంపూర్ణ న్యాయం చేయాలి

- 13 నెలలు గడిచినా పెండింగ్‌లోనే పరిహారం
- సంగారెడ్డి జిల్లా ప్రత్యేక సమస్యగా పరిష్కరించాలి
- ముఖ్యమంత్రికి టీపీజేఏసీ బహిరంగ లేఖ




**ప్రజానావ, హైదరాబాద్:** సిగాచి పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి 13 నెలలు గడిచినా బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగకపోవడం తీవ్ర విచారకరమని టీపీజేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ప్రమాద బాధితుల పట్ల ప్రభుత్వ బాధ్యతను గుర్తుచేస్తూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు టీపీజేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన 54 బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి సహాయంలో ఇప్పటివరకు కేవలం రూ.42 లక్షలు మాత్రమే అందాయని, మిగిలిన రూ.58 లక్షలు నేటికీ పెండింగ్‌లో ఉండటం విచారకరమని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి సారించి బకాయి ఉన్న రూ.58 లక్షలను తక్షణమే విడుదల చేయించి ప్రతి బాధిత కుటుంబానికి పూర్తిగా రూ.1 కోటి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల ఆర్థిక సహాయం 11 మంది బాధితులకు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.1 లక్ష సహాయం మరో ఎనిమిది మందికి ఇంకా అందాల్సి ఉందని తెలిపారు. కార్మికుల భవిష్య నిధి, జీవిత బీమా పథకం ప్రయోజనాలు పొందాల్సిన వారికి, అలాగే 25 మంది బాధితులకు చెల్లించాల్సిన కార్మికుల రాజ్య బీమా సంస్థ ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదం అనంతరం పరిశ్రమ యాజమాన్యం బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తూ పలువురు కార్మికులను అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని కమిటీ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. పరిశ్రమ అభివృద్ధిలో చెమటోడ్చిన కార్మికులను కష్టకాలంలో రోడ్డున పడేయడం సమంజసం కాదని, తొలగించబడిన కార్మికుల వివరాలను సేకరించి వారి వేతన బకాయిలు, ఇతర చట్టబద్ధ ప్రయోజనాలు అందేలా కార్మిక శాఖ ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి జీవనం దుర్భరంగా మారిన రాజేష్ కుమార్ చౌదరి, సుష్మ, దివ్య పరిస్థితులను కూడా కమిటీ ప్రస్తావించింది. ప్రస్తుతం వారికి అందించిన రూ.10 లక్షల పరిహారం వైద్య ఖర్చులు, ఉపాధి కోల్పోవడం వల్ల జరిగిన నష్టం, శారీరక, మానసిక వేదనతో పోలిస్తే ఏమాత్రం సరిపోదని పేర్కొంది. వారి గాయాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని పరిహారాన్ని రూ.50 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఉన్నత విద్యను అభ్యసించిన సుష్మ, దివ్యలకు వారి విద్యార్హతలకు తగిన విధంగా రాజధాని పరిసర ప్రాంతాల్లోని ఔషధ తయారీ పరిశ్రమల్లో శాశ్వత ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సిగాచి ప్రమాదాన్ని సాధారణ ఘటనగా చూడకుండా సంగారెడ్డి జిల్లా ప్రత్యేక సమస్యగా పరిగణించి ముఖ్యమంత్రి స్వయంగా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలని జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. నిర్ణీత గడువు విధించి బాధిత కుటుంబాలకు రావాల్సిన అన్ని రకాల పరిహారాలు, సంక్షేమ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా సమన్వయకర్త అశోక్ కుమార్, ముఖ్య నిర్వాహకులు శ్రీధర్ మహేంద్ర, సహాయ నిర్వాహకులు చంద్రా రెడ్డి, రామకృష్ణ, చంద్ర మోహన్ చారి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న స్కూల్ ఎలక్షన్స్

- ఉత్సాహంగా పాల్గొన్న కూసుమంచి ఉన్నత పాఠశాల విద్యార్థులు
- ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకే మాక్ ఎన్నికలు
- ఎంఈవో, హెచ్‌ఎం రాయల వీరస్వామి




**ప్రజానావ, కూసుమంచి:** ఎటుచూసినా కోలాహలం.. బారులు తీరిన ఓటర్లు.. కిటకిటలాడిన క్యూ లైన్లు.. అభ్యర్థుల ఆందోళన.. నువ్వా.. నేనా అన్నట్లు ఓటింగ్.. ఏజెంట్ల సందడి.. మందకొడిగా ప్రారంభమై ఊపందుకున్న పోలింగ్.. అధికారుల హడావుడి.. వైద్యశాఖ శిబిరం.. హెల్ప్‌డెస్క్.. ఉన్నతాధికారుల పర్యటన.. పోలీసుల భద్రతా చర్యలు.. ఓటింగ్.. కౌంటింగ్.. గెలుపు ఉత్సాహం.. ఇలా నిజమైన ఎన్నికలను తలపించేలా కూసుమంచి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మాక్ ఎలక్షన్స్ ఆకట్టుకున్నాయి. ప్రజాస్వామ్య విలువలు, సహకారం, సమాజం పట్ల బాధ్యత, ప్రజాస్వామ్య విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాలలో మాక్ ఎన్నికలను నిర్వహించారు. విద్యార్థులంతా ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొనగా, ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్ విధానం, కౌంటింగ్ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో ఓటర్ల జాబితాను ప్రకటించి, తరగతులు, సెక్షన్ల వారీగా బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. పోలింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులను నియమించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. విద్యార్థుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, పరిశీలించడం, ఉపసంహరణకు అవకాశం కల్పించడం, పోటీలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం, రెండు రోజుల పాటు ప్రచారం నిర్వహించడం వంటి ప్రక్రియలను పూర్తి చేసి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటు వేశారు. ఎన్నికల అధికారులు సాధారణ ఎన్నికల తరహాలో జాగ్రత్తలు, ఏర్పాట్లు చేపట్టడంతో విద్యార్థులకు పోలింగ్ విధానంపై పూర్తి అవగాహన ఏర్పడింది. మాక్ ఎలక్షన్స్‌లో విద్యార్థులు ఓటర్లుగా, అభ్యర్థులుగా మారి ప్రచారం నిర్వహించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం తమకు ఎంతో ఆసక్తికరంగా, ఆనందంగా అనిపించిందని విద్యార్థులు తెలిపారు. మధ్యాహ్నం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించారు. ఓటర్లు, ఏజెంట్లు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ స్టేషన్ తదితర ఏర్పాట్లతో పాఠశాల ప్రాంగణం మొత్తం నిజమైన ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, భవిష్యత్తులో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఓటింగ్ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. చిన్ననాటి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ప్రజాస్వామ్య విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఎస్డీ నూర్జహాన్, శ్రీలక్ష్మి, హరీశ్, నరేశ్ ప్రధాన భూమిక పోషించగా, ఇతర ఉపాధ్యాయులు సహకరించారు.



## ఎస్ఐఆర్ ఫేజ్–1పై కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్ష

- పకడ్బందీగా ప్రక్రియ నిర్వహణకు పార్టీ శ్రేణులతో కలిసి ముందుకు
- జూమ్ సమావేశంలో కీలక సూచనలు

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** ఎస్ఐఆర్ ఫేజ్–1 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులతో సమన్వయంతో ముందుకు సాగుతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ ఫేజ్–1 నిర్వహణపై జరిగిన జూమ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రక్రియకు సంబంధించిన కీలక సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ఫేజ్–1ను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అసెంబ్లీ, పార్లమెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## 31 డిమాండ్లపై ఏఐటీయూసీ అల్టిమేటం

- చర్చలు విఫలమైతే సమ్మెకు సిద్ధం
- కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం: ఏఐటీయూసీ




**ప్రజానావ, కొత్తగూడెం:** సింగరేణి కార్మికుల 31 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఆర్‌ఎల్‌సీ చర్చల్లో కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ నెల 21న జరిగే చర్చలు విఫలమైతే ఫెయిల్యూర్ రిపోర్ట్ తీసుకుని, అనంతరం అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మెడికల్ బోర్డును ప్రతి నెల మూడో వారంలో నిర్వహించాలని, కారుణ్య నియామకాలు, మెడికల్ ఇన్‌వాలిడేషన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ అటెండెన్స్ నిబంధనలను మార్చి కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 2016–17 బ్యాచ్ జేఎంఈటీల ప్రమోషన్ సమస్యను పరిష్కరించి, ఖాళీల ఆధారంగా బీ–గ్రేడ్ ప్రమోషన్లు కల్పిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యుల కమిటీ ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. మారుపేర్ల బాధిత కార్మికుల ఉద్యమానికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.54 వేల కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయడంతో పాటు హెచ్‌ఆర్‌ఏను 8 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కట్ చేసిన ఇంక్రిమెంట్ల సమస్యను పరిష్కరిం చాలని, పెండింగ్ విజిలెన్స్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సింగరేణిలోని అన్ని విభాగాలను అవుట్‌సోర్సింగ్‌కు అప్పగించకుండా యాజమాన్యమే నిర్వహించాలని, 'ఎన్ మైనస్' విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని పెంచాలని కోరారు. పెర్క్స్‌పై విధిస్తున్న ఐటీ భారంపై సింగరేణి యాజమాన్యం స్వతంత్రంగా నిర్ణయం తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని అన్నారు. 31 డిమాండ్లలో కీలకమైన సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 21 తర్వాత కూడా పరిష్కారం లభించకపోతే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని సమ్మెకు వెళ్తామని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

## లక్ష మందితో సీఎం సభ

- సంగారెడ్డిలో సీఎం బహిరంగ సభకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల

**ప్రజానావ, సంగారెడ్డి:** సంగారెడ్డిలో శనివారం నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభను లక్ష మంది హాజరయ్యేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ఆవిష్కరించనున్నారని వెల్లడించారు. సీఎం సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50 వేల మంది హాజరవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు పంపిణీ చేసిందని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని, రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నట్లు తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## 31లోగా చేయూత పెన్షన్ దరఖాస్తులు

- అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్

**ప్రజానావ, ఆలేరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్ పథకంలో భాగంగా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన కొత్త లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు పెన్షన్ పొందని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వితంతు పెన్షన్ కోసం నూతన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో సమర్పించాల్సి ఉంటుంది. దివ్యాంగుల పెన్షన్ కోసం నూతన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో సమర్పించాలి. ఒంటరి మహిళల పెన్షన్ కోసం నూతన దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, సంబంధిత ధృవపత్రం, కుల ధృవపత్రం జిరాక్స్, ఆధార్ ధృవపత్రం జిరాక్స్, ఫోన్ నంబర్, ఒక ఫొటో తదితర అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని చైర్‌పర్సన్ బిజన బాలమణి భాస్కర్ పేర్కొన్నారు. అర్హులైన వారు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.





## కాజీపేట ఆర్‌ఓబీ పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ప్రజానావ. హనుమకొండ : కాజీపేటలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాజీపేటలో కొనసాగుతున్న ఆర్‌ఓబీ నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల ఆలస్యంపై అలసత్వం ప్రదర్శిస్తే ఎంతమాత్రం సహించేది లేదని కాంట్రాక్టర్లను కలెక్టర్ హెచ్చరించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సురేష్‌బాబు ఆర్‌ఓబీ నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిట్లం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి
- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు



ప్రజానావ, కామారెడ్డి: పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు తెలిపారు.

## శ్రావణమాసం తొలి శుక్రవారం భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ



ప్రజానావ, వేములవాడ: శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయాన్ని మామిడి తోరణాలు, కొబ్బరి ఆకులు, రంగురంగుల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ గాయత్రి దేవి, శ్రీ మాత మాణిక్యాంబ దేవి, శ్రీ బద్ది పోచమ్మ అమ్మవార్లకు మహిళలు ఓడి బియ్యం సమర్పించి పూజలు చేశారు. భక్తులు కోడె మొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు, నిత్యకల్యాణం, చండీహోమం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. పుట్టువెంట్రుకలు, చెవులు కుట్టించడం, అన్నప్రాసన వంటి శుభకార్యాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## భూ వివాదంలో హత్యాయత్నం.. ఇద్దరి అరెస్ట్



ప్రజానావ, కోనరావుపేట: భూ వివాదంలో ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వట్టిమల్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్, సామల లచ్చవ్వలకు అదే గ్రామానికి చెందిన పెద్దగొల్ల సత్తయ్యతో 8 గుంటల భూమి, దారి విషయంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 12న పంచాయతీ జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం భూమి వద్ద ఇరువర్గాల మధ్య గొడవ జరగగా, శ్రీనివాస్ పారతో సత్తయ్య తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, లచ్చవ్వలపై కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తును పూర్తి చేసి నిందితులను రిమాండ్ కు తరలించేందుకు కృషి చేసిన ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి, సిబ్బందిని సీఐ కె.రవీందర్ అభినందించారు.



## అభివృద్ధిపై ఎమ్మెల్యే మోసపూరిత ప్రచారం

- యువతకు ఇచ్చిన ఉద్యోగాల హామీ ఏమైంది?
- మాజీ మంత్రి జోగు రామన్న
- ప్రజా సమస్యలను విస్మరించి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం
- బీఆర్‌ఎస్‌లోకి బీజేపీ నేత, మాజీ కౌన్సిలర్ చేరిక

ప్రజానావ, ఆదిలాబాద్: జిల్లా అభివృద్ధిపై ఎమ్మెల్యే మోసపూరిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని 20వ వార్డుకు చెందిన బీజేపీ నేత, మాజీ కౌన్సిలర్ మెస్రం కృష్ణ బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా, జోగు రామన్న ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ యువతకు హామీ ఇచ్చిన ఐదు వేల ఉద్యోగాల విషయంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేయడం తప్ప యువత సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే దృష్టి సారించడం లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదని విమర్శించారు. పీఎం కిసాన్ యోజనలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించిన ఆయన, లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తూ రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం మోసపూరిత చర్యగా అభివర్ణించారు. జిల్లా సమస్యలపై దృష్టి సారించాల్సిన ఎమ్మెల్యే ప్రజా ప్రయోజనాలను, అభివృద్ధిని పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వైఫల్యాలను ప్రజలు, ముఖ్యంగా యువత గుర్తిస్తున్నారని, దీంతో యువతతో పాటు బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని జోగు రామన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అజయ్, అశోక్ స్వామి, పందిరి భూమన్న, కొండ గణేష్, రామేశ్వర్, దమ్మపాల్, మహేందర్, బట్టు సతీష్, కుమ్రా రాజు, బుట్టి శివ, సలీమ్, కిరణ్, దివిటి రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేను అవమానించడం బీజేపీ రాజకీయ సంస్కృతికి నిదర్శనం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అంబేద్కర్ జంక్షన్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు నిరసన ర్యాలీ
- డీసీసీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



ప్రజానావ, హనుమకొండ: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పట్ల బీజేపీ నాయకులు వ్యవహరించిన తీరును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కుల, మతాల పేరుతో రాజకీయాలు చేయడం బీజేపీకి తగదని ఆయన అన్నారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డి ఆధ్వర్యం లో అంబేద్కర్ జంక్షన్ వద్ద ఖర్గేకు సంఘీభావంగా నిర్వహించిన సత్యాగ్రహ నిరసన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడు తూ.. దేశవ్యాప్తంగా ప్రజల ఆదరణ కోల్పోతున్నామని గ్రహించిన బీజేపీ కుల, మతాలను రాజకీయాల్లోకి తీసుకొస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ హిందువులతో పాటు ముస్లింలు, క్రైస్తవులు సహా అన్ని వర్గాల ప్రజలకు సమానంగా అండగా ఉంటుందని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల విషయంలో బీజేపీ ఎంపీలు చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే తప్పుబట్టారు. రేషన్ కార్డులపై ఎవరి ఫొటోలు ఉన్నాయనే అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్న బీజేపీ నాయకులు ముందుగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టిందని నాయిని తెలిపారు. గత ప్రభుత్వాల కాలంలో పెండింగ్‌లో ఉన్న సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ప్రయోజనం కలిగించే పథకాల అమలును అడ్డుకునే ప్రయత్నాలు చేయడం రాజకీయంగా సరైన పద్ధతి కాదని అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే వంటి సీనియర్ నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బీజేపీ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమన్నారు. రాజకీయ నాయకులు పరస్పరం గౌరవించుకుంటూ ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని సూచించారు. గతంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య కూడా పరస్పర గౌరవం, సలహాలు తీసుకునే రాజకీయ సంస్కృతి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలను ఉపయోగించుకొని వ్యక్తిగత దూషణలకు పాల్పడటం, మతాలను అగౌరవపరచడం మంచి రాజకీయ సంప్రదాయం కాదన్నారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు వేగవంతమయ్యా యని ఎమ్మెల్యే ఆరోపించారు. రైల్వేలు, ప్రభుత్వ ఆస్తులు, ప్రజా సంస్థలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, పేదల సమస్యలపై దృష్టి పెట్ట కుండా రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సంయమనం పాటిస్తూ ప్రజా సమస్యలపై పోరాడాలని, రాజకీయాల్లో పద్ధతి, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుంచి పాదయాత్రగా పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో టీపీసీసీ, డీసీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుకులపై కేంద్రం పైశాచిక చర్యలా?

- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి
- నర్మాల ఎగువ మానేరు జలాశయం సందర్శన
- మానేరు పరిరక్షణ ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం



ప్రజానావ, గంభీరావుపేట: ప్రశ్నించే గొంతుకులపై కేంద్ర ప్రభుత్వం పైశాచిక చర్యలకు పాల్పడుతుందని సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయాన్ని సందర్శించారు. మానేరు పరిరక్షణకై ఏర్పాటైన ప్రజా చైతన్య యాత్ర ప్రారంభించారు. ప్రాజెక్టు నందు మరమ్మతులకు నోచని ఆప్రాన్ ను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు. రెండు కోట్ల ఉద్యోగాలు, విదేశాల్లో ఉన్న నల్ల డబ్బులు వెలికి తీసి ప్రతి మహిళ జన ధన్ ఖాతాలో డబ్బులు వేస్తానని హామీలు గుప్పించిన మోడీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నీట్ పేపర్ లీకై 75 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాలు పడితే చర్యలు లేవని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో నిత్యవసర సరుకుల రేట్లు విపరీతంగా పెంచడంతో సామాన్యుడు వంట గ్యాస్, డిజిల్, పెట్రోల్ తో మొదలుకొని నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. అధాని, అంబానీలకు సహజ వనరులు విపరీతంగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోడీ ఉన్న హాయంలో అంబానీ ఒక చిన్న కాంట్రాక్టర్ అని నేడు ప్రపంచంలోనే ఆగర్భ శ్రీమంతుల్లో ఒక్కరని విమర్శించారు. ప్రపంచంలోనే మూడవ ధనిక దేశంగా తీర్చిదిద్దుతానన్న మోదీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు దేశం 60 లక్షల కోట్ల అప్పుంటే నేడు 200 లక్షల కోట్ల అప్పుకు చేరుకుందన్నారు. రైతు చట్టానికై దేశంలోని రైతులు 100 రోజులు పోరాటం చేసి అందులో 750 మంది రైతులు మృతి చెందినట్లు తెలిపారు. ఆ తదుపరి రైతులకు క్షమాపణ చెప్పి రైతు చట్టం తీసుకువస్తానని చెప్పిన మోడీ ఇప్పటివరకు చట్టాన్ని అమలు చేయక దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఇదేమిటని ప్రశ్నించే గొంతుకులకుపై బిజెపి ప్రభుత్వం విరుచుక పడుతుందని దుయ్యబట్టారు. నిజాం కాలంలో నిర్మించిన మానేరు ప్రాజెక్టును సాంకేతిక పరిజ్ఞానంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజాం హయాంలో ప్రాజెక్టు నిర్మించి 75 ఏళ్లు గడుస్తున్న ఇప్పటివరకు ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదన్నారు. ఏళ్ల తరబడిగా ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పూడికతీత చేపట్టామని ప్రకటించినప్పటికీ ఇక్కడి ప్రాజెక్టులో పెరిగిన పూ టిక తీయకపోవడం విచారకరమన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని అందుకోసం ప్రభుత్వము రూ. 500 కోట్లు కేటాయించి సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఇట్టి విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తోపాటు సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టును కాపాడేందుకు సిపిఐ కంకణం కట్టుకుందని, ప్రాణం ఉన్నంతవరకు సమస్యపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, నాయకులు గుంటి వేణు, నాగరాజు, లక్ష్మణ్, మానేరు పోరాట పరిరక్షణ కమిటీ నాయకులు మంగలి చంద్రమౌళి భాగయ్య లతోపాటు పలువురు పాల్గొన్నారు.



## మువ్వన్నెలతో మురిసిన మహబూబ్‌నగర్ జిల్లా

ప్రజానావ ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్ న్యూ టౌన్ నుంచి క్లాక్ టవర్ వరకు సాగిన ఈ భారీ ర్యాలీతో పట్టణం మువ్వన్నెల మయంగా మారింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, కులమతాలకు అతీతంగా సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో యువత భాగస్వాములు కావాలన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పేర్కొంటూ రాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



## గట్టు ఎత్తిపోతల సామర్థ్యం పెంపు: క్యాబినెట్ కీలక నిర్ణయం

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : కేటీదొడ్డి, గట్టు మండలాల రైతుల చిరకాల స్వప్నం నెరవేరింది. నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకం నీటి నిల్వ సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచుతూ, రూ. 1,781 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ సామర్థ్యం పెంపుతో గద్వాల నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందుతుందని, నియోజకవర్గం సస్యశ్యామలం కానుందని పేర్కొన్నారు. నిధులు కేటాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఎమ్మెల్యే రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

## దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే హర్ ఘర్ తిరంగా

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి
- సిరిసిల్లలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




ప్రజానావ, సిరిసిల్ల : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం, జాతీయ జెండాపై ప్రతి ఒక్కరిలో గౌరవ భావాన్ని పెంపొందించడం, దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీకి ముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు జాతీయ జెండాలను చేతిలో పట్టుకుని, దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, దేశంలోని ప్రతి రాష్ట్రానికి భాష, సంస్కృతి, సంప్రదాయాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ 140 కోట్ల మంది భారతీయులను ఒకే భావనతో, ఒకే జాతీయ స్ఫూర్తితో కలిపి ఉంచేది మన త్రివర్ణ పతాకమేనని అన్నారు. కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా ప్రతి భారతీయుడిని ఏకతాటిపైకి తీసుకువచ్చే శక్తి మన జాతీయ జెండాకు ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జ్ శ్రీ గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేసే గొప్ప ప్రజా ఉద్యమమని అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు 30 ట్రాక్టర్లతో ప్రత్యేక హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ జెండాలతో అలంక రించిన ట్రాక్టర్లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొని దేశభక్తి నినాదాలతో ర్యాలీని ఉత్సాహభ రితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, కొడిపల్లి గోపాల్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కో–కన్వీనర్లు ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మండల పదాధికారులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొని హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతం చేశారు.

## జిల్లా నూతన మహిళా కమిటీ సభ్యుల నియామకం

ప్రజానావ, పెద్దపల్లి : రాష్ట్రీయ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు జాపతి రాజేష్ పటేల్ సూచన మేరకు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మండల భూపాల్ పెద్దపల్లి జిల్లా నూతన మహిళా కమిటి సభ్యులను నియమించారు. పెద్దపల్లి జిల్లా రాష్ట్రీయ హిందూ పరిషత్ రణచండి (మహిళా విభాగం) అధ్యక్షురాలుగా కన్నం అనూషని ఉపాధ్యక్షురాలుగా కర్రే అర్చన ని, నియమించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా రాష్ట్రీయ హిందూ పరిషత్ రణచండి (మహిళా విభాగం) అధ్యక్షురాలు కన్నం అనూష, ఉపాధ్యక్షురాలు అర్చన, రాష్ట్రీయ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మండల భూపాల్ కి ఈ బాధ్యతలు రావడానికి సహకరించిన




రాష్ట్రీయ హిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు జాపతి రాజేష్ పటేల్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు శుక్రవారం ఏదుల మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాము యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏదుల మండల ఇంచార్జ్ సురేందర్ యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట మండల ఇంచార్జ్ దాసరాజు ప్రవీణ్,



పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్త దారులు

- ప్రతిష్టంభనలో అమెరికా–ఇరాన్ చర్చలు
- హర్మూజ్ జలసంధి పునరుద్ధరణే ప్రధాన లక్ష్యంగా రంగంలోకి ఆస్ట్రియా, గ్రీస్

**వాషింగ్టన్:** యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు ప్రతిష్టంభనకు చేరడంతో దౌత్య ప్రయత్నాలు కొత్త దారులు వెతుకుతున్నాయి. ఒమన్, పాకిస్థాన్, టర్కీ, ఖతార్‌లతో పాటు తాజాగా ఆస్ట్రియా, గ్రీస్ కూడా రంగంలోకి దిగాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆస్ట్రియా, గ్రీస్ విదేశాంగ మంత్రులతో చర్చించిన అనంతరం వారు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చితో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరిగే హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. యుద్ధ ప్రభావాలు, ఆర్థిక నష్టాలు, ఆయుధ నిల్వలు తగ్గిపోవడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సవాళ్లుగా మారాయి. ఆస్ట్రియా, గ్రీస్ ప్రయత్నాలు అధికారిక మధ్యవర్తిత్వం కంటే ఇరుపక్షాలపై ఒత్తిడి పెంచేందుకు ఉద్దేశించినవేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇరుపక్షాల విశ్వాసం లేకుండా మధ్యవర్తిత్వం ఫలించడం కష్టమని నిపుణులు పేర్కొన్నారు.

### ఇరాన్ ఆరోపణలు

హర్మూజ్ పరిస్థితి దెబ్బతినడానికి అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన 'అక్రమ దాడులే' కారణమని అరాఘ్చి ఆరోపించారు. జూన్‌లో కుదిరిన తాత్కాలిక ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందన్నారు. మరోవైపు హర్మూజ్‌ను తిరిగి తెరవడం, చమురు, గ్యాస్ ధరలను అందుబాటులో ఉంచడం తక్షణ లక్ష్యాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా చూడటం మరో ప్రధాన లక్ష్యమన్నారు.

#### ఆస్ట్రియా వేదికగా చర్చలు?

అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రధాన కార్యాలయం వియన్నాలో ఉండటంతోపాటు 2015 ఇరాన్ అణు ఒప్పందానికి దారితీసిన చర్చలకు కూడా అదే వేదికైంది. దీంతో భవిష్యత్ చర్చలకు వేదికగా వ్యవహరించేందుకు ఆస్ట్రియా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. హర్మూజ్, ఎర్ర సముద్ర ప్రాంతాల్లో గ్రీస్‌కు కీలక నౌకాయాన ప్రయోజనాలు ఉండటంతో స్వేచ్ఛాయుత నౌకాయానం, సముద్ర భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆ దేశం స్పష్టం చేసింది. సమస్యకు సైనిక పరిష్కారం లేదని, దౌత్యమే మార్గమని ఆస్ట్రియా పేర్కొంది.

# జనగణనలో కులం వివరాలు

- 40 ప్రశ్నలతో జనగణన–2027 ప్రశ్నావళి నోటిఫికేషన్
- ఆధార్, ఓటర్ ఐడీ, బ్యాంకు ఖాతాల వివరాలూ నమోదు
- పూర్తిగా డిజిటల్ విధానంలో దేశవ్యాప్తంగా ప్రక్రియ



**న్యూఢిల్లీ:** జనగణన–2027లో భాగంగా జనాభా లెక్కల సమయంలో అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. తొలిసారిగా కుల వివరాలను కూడా జనగణనలో నమోదు చేయనున్నారు. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రశ్నావళి వివరాలను వెల్లడించారు. వ్యక్తి షెడ్యూల్డ్ కులం (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ)కు చెందినవారా? అయితే వారి కులం ఏమిటి? అనే వివరాలను సేకరించనున్నారు. జనగణనలో కుల వివరాలను నమోదు చేయడం ఇదే తొలిసారి. ప్రశ్నావళిలో కులాల జాబితాను ఇవ్వకుండా.. ప్రజలు స్వయంగా వెల్లడించే వివరాలనే నమోదు చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

#### వ్యక్తిగత వివరాల నమోదు

వివాహ స్థితి, వివాహ వయసు, జీవిత భాగస్వామి పేరు, జాతీయత, మతం, తల్లిదండ్రుల వివరాలు, వైకల్యం, మాతృభాష, తెలిసిన ఇతర భాషలు, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై వివరాలను సేకరిస్తారు. విద్యా సంస్థలో చదువుతున్నారా? అత్యున్నత విద్యార్హత ఏమిటి? విద్యా విభాగం, పనిచేసిన రంగం, వృత్తి, పరిశ్రమ/వాణిజ్యం/సేవల స్వభావం, కార్మికుడి వర్గం వంటి వివరాలనూ నమోదు చేస్తారు. ప్రతి వ్యక్తి జన్మస్థలం, చివరిగా నివసించిన ప్రాంతం, వలసకు కారణం, వలస వచ్చిన తర్వాత గ్రామం లేదా పట్టణంలో ఉంటున్న కాలం, శాశ్వత నివాస చిరునామా వంటి వివరాలను కూడా ప్రశ్నావళిలో చేర్చారు. ప్రస్తుతం వివాహితులు, వితంతువులు, విడాకులు పొందిన, విడిపోయిన మహిళలను వారి పిల్లల సంఖ్యకు సంబంధించిన వివరాలు అడగనున్నారు.

#### ఆధార్ నుంచి బ్యాంకు ఖాతాల వరకు

కొవిడ్–19 టీకా తీసుకున్న ప్రదేశం, మొత్తం బ్యాంకు ఖాతాల సంఖ్య, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్టు నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ ఉందా అనే వివరాలను కూడా సేకరించనున్నారు. దేశంలోనే అతిపెద్ద జనగణన ప్రక్రియను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. లడఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లో సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జనాభా లెక్కలు నిర్వహించనున్నారు. దీనికి ముందు ఆగస్టు 17 నుంచి 31 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించారు. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో జనాభా లెక్కల ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది.

### తొలి దశలో గృహాల గణన

జనగణనలో తొలి దశగా గృహాల జాబితా, గృహ గణన ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. ఏప్రిల్ 16 నుంచి పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పనులు ప్రారంభమయ్యాయి. ఈ దశలో ఇళ్లు, భవనాలు, కుటుంబాల వివరాలతోపాటు గృహ వసతులకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు సేకరిస్తున్నారు. 2021లో నిర్వహించాల్సిన జనగణన కొవిడ్–19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. తాజా జనగణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లను ఆమోదించింది.

# నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

- నల్సార్ వ్యవహారంలో బీసీఐ జోక్యం సరికాదు
- వారిపై ఎలాంటి చర్యలు వద్దు
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ/హైదరాబాద్:** విద్యార్థులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతోపాటు నిరసన తెలిపే హక్కు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ 2026 బ్యాచ్ విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ను ఆదేశించారు. నల్సార్ స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించడాన్ని విద్యార్థులు వ్యతిరేకించడం తనకు, వారికీ మధ్య ఉన్న విషయమని.. ఇందులో బీసీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించవద్దంటూ కొంతమంది విద్యార్థులు వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులకు లేఖలు రాసినట్లు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన బీసీఐ.. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు నల్సార్ 2026 బ్యాచ్ న్యాయ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ దేశంలోని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసింది.

#### బీసీఐ తీరుపై అభ్యంతరాలు

బీసీఐ ఆదేశాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించినందుకు విద్యార్థులను న్యాయవాద వృత్తిలోకి రాకుండా అడ్డుకుంటామని బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాన్ని సీజేఐ సూర్యకాంత్ కూడా తీవ్రంగా పరిగణించారు. బీసీఐ జారీ చేసిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ.. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించారు. ''నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. బీసీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముంది?'' అని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై విధించిన ఆంక్షలను బీసీఐ వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.

### బీసీఐ ఆదేశాలపై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చర్చిస్తాం

**నాల్సార్ వీసీ శ్రీకృష్ణ దేవరావు**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌ను నాల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన వ్యక్తులపై విచారణ జరపాలన్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఆదేశాలను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ముందుంచి చర్చిస్తామని నాల్సార్ వీసీ శ్రీకృష్ణ దేవరావు తెలిపారు. విశ్వవిద్యాలయ పాలనా నిబంధనల ప్రకారం ఈ విచారణ రాజ్యాంగబద్ధమేనా, అనుమతించదగినదేనా అన్న అంశాలను కౌన్సిల్ పరిశీలిస్తుందని చెప్పారు. అనంతరం నిర్ణయాన్ని బీసీఐకి తెలియజేస్తామన్నారు. 2026 బ్యాచ్ బీఏ, ఎల్ఎల్‌బీ (ఆనర్స్) పట్టభద్రులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ రాష్ట్ర బార్ కౌన్సిళ్లను బీసీఐ తొలుత ఆదేశించింది. అలాగే సీజేఐని ఆహ్వానించే అంశంలో చోటుచేసుకున్న పరిణామాలకు బాధ్యులను గుర్తించి విచారణ నివేదిక ఇవ్వాలని కోరింది. అయితే కొద్ది గంటల్లోనే ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత ఆదేశాలను బీసీఐ ఉపసంహరించుకుంది. సంబంధిత వ్యక్తులపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్న ఆదేశాన్ని మాత్రం కొనసాగించింది. ఈ అంశంపై అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలించి ఆగస్టు 19న తుది నిర్ణయం తీసుకుంటామని బీసీఐ తెలిపింది. నాల్సార్‌కు చెందిన కొంతమంది విద్యార్థులు ఈ ఏడాది జూలైలో వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులకు లేఖలు రాసి స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను వ్యతిరేకించారు. అయితే స్నాతకోత్సవ తేదీని ఇంకా ప్రకటించలేదు.

# పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా యువతకు శిక్షణ

- ఉద్యోగానికి ముందే ప్రాక్టికల్ అనుభవం
- ఇంటర్న్‌లకు నెలకు కనీసం రూ.9వేల ఆర్థిక సాయం
- పీఎంఐఎస్ ఇండస్ట్రీ అవార్డుల ప్రదానంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** పరిశ్రమల అవసరాలకు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే యువత నైపుణ్యాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) ప్రధాన ఉద్దేశమని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఉద్యోగంలో చేరిన వెంటనే బాధ్యతలు సమర్థంగా నిర్వహించేలా యువతకు ముందుగానే ప్రాక్టికల్ అనుభవం కల్పించడంలో పీఎంఐఎస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. శుక్రవారం ఢిల్లీలో పీఎంఐఎస్ ఇంటర్న్‌లతో ఆమె సమావేశమై మాట్లాడారు.

#### పరిశ్రమ అవసరాలే ప్రాతిపదికగా..

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పీఎంఐఎస్‌లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువతకు అవకాశం కల్పిస్తున్నారు. ఎంపికైన ఇంటర్న్‌లకు నెలకు కనీసం రూ.9 వేల ఆర్థిక సాయం అందుతుంది. ప్రస్తుతం పథకం పైలట్ దశలో మూడో విడత కొనసాగుతోంది. పరిశ్రమల ప్రతినిధులు, గ్రాడ్యుయేట్లు, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన యువతతో విస్తృతంగా చర్చించిన తర్వాతే పథకాన్ని రూపొందించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. కొత్తగా పట్టభద్రులైన యువత ఉద్యోగంలో చేరిన వెంటనే సంస్థల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని పరిశ్రమలు ఆశిస్తున్నాయని మంత్రి చెప్పారు. అయితే విద్యాభ్యాసం పూర్తిచేసిన చాలా మంది యువతకు అవసరమైన ప్రాక్టికల్ అనుభవం లేకపోవడం సమస్యగా మారుతోందన్నారు. విద్యార్హతలకు అదనంగా పరిశ్రమకు అవసరమైన కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు.

#### భాగస్వామ్య సంస్థలకు గుర్తింపు

పీఎంఐఎస్ పైలట్ దశలో భాగస్వామ్య సంస్థలు అందించిన సేవలను గుర్తిస్తూ ఢిల్లీలో పీఎంఐఎస్ ఇండస్ట్రీ అవార్డులను మంత్రిత్వ శాఖ ప్రదానం చేసింది. పథకం పైలట్ దశలో చివరి సంవత్సరం గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు కూడా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.




### పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి

# 301 శౌర్య పతకాలు

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటన
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల సిబ్బందికి 197 పతకాలు
- మొత్తం 1,057 మందికి శౌర్య, సేవా పతకాలతో సత్కారం

**న్యూఢిల్లీ:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీస్, అగ్నిమాపక, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్, జైళ్ల శాఖలకు చెందిన సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో పతకాలను ప్రకటించింది. అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి 301 శౌర్య పతకాలు, విశిష్ట సేవలు అందించిన వారికి 92 రాష్ట్రపతి పతకాలు, అంకితభావంతో సేవలందించిన వారికి 664 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించింది. మొత్తంగా 1,057 మంది సిబ్బంది ఈసారి పురస్కారాలకు ఎంపికయ్యారు. ప్రకటించిన 301 శౌర్య పతకాల్లో 272 పోలీసు సిబ్బందికి, 29 అగ్నిమాపక సిబ్బందికి దక్కాయి. వీరిలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహించిన 197 మంది, జమ్మూకశ్మీర్‌కు చెందిన 51 మంది, ఈశాన్య ప్రాంతాలకు చెందిన 12 మంది, ఇతర ప్రాంతాలకు చెందిన 41 మంది ఉన్నారు. ప్రాణాలు, ఆస్తులను రక్షించడం, నేరాలను అడ్డుకోవడం, నేరస్థులను పట్టుకోవడం వంటి సందర్భాల్లో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు ఈ పతకాలను అందజేస్తారు.

#### విశిష్ట సేవకు 92 రాష్ట్రపతి పతకాలు

విశిష్ట సేవలు అందించిన 92 మంది సిబ్బందికి రాష్ట్రపతి పతకాలు (పీఎస్ఎం) ప్రకటించారు. వీటిలో పోలీసు సేవలకు 83, అగ్నిమాపక సేవలకు 4, సివిల్ డిఫెన్స్, హోంగార్డ్ సేవలకు 3, జైళ్ల శాఖకు 2 పతకాలు ఉన్నాయి.

#### 664 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్

అంకితభావంతో విలువైన సేవలు అందించిన సిబ్బందికి 664 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ (ఎంఎస్ఎం) ప్రకటించారు. వీటిలో పోలీసు సిబ్బందికి 606, అగ్నిమాపక సిబ్బందికి 28, సివిల్ డిఫెన్స్, హోంగార్డులకు 18, జైళ్ల శాఖ సిబ్బందికి 12 పతకాలు ఉన్నాయి. మొత్తంగా ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐదు విభాగాలకు చెందిన 1,057 మంది సిబ్బంది పురస్కారాలు అందుకోనున్నారు.

# విభజన విషాదాలను మరువొద్దు

- బాధితుల త్యాగాలను స్మరించుకున్న ప్రధాని మోదీ
- ప్రతికూలతలను అధిగమించి దేశ ప్రగతికి తోడ్పడ్డారు
- ఐక్యత, సద్భావనను మరింత బలోపేతం చేయాలని పిలుపు

**న్యూఢిల్లీ:** 1947లో దేశ విభజన సందర్భంగా ప్రాణాలు కోల్పోయినవారిని, తీవ్రంగా ప్రభావితమైన ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం స్మరించుకున్నారు. 'విభజన విషాదాల స్మృతి దినం' సందర్భంగా వారికి నివాళులర్పించారు. విభజనతో తమ ఇళ్లను, ఆత్మీయులను కోల్పోయి అపారమైన వేదనను అనుభవించిన బాధితుల త్యాగాలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. దేశ విభజన ఎన్నో కుటుంబాలను స్వస్థలాలకు దూరం చేసిందని మోదీ అన్నారు. అనేక మంది తమ ఆత్మీయులను కోల్పోయారని, లక్షలాది మంది తీవ్ర విషాదాన్ని అనుభవించారని గుర్తుచేశారు. అయితే ఆ క్లిష్ట పరిస్థితులను అధిగమించి, శూన్యం నుంచి జీవితాలను పునర్నిర్మించుకున్నారని పేర్కొన్నారు. విభజన బాధితులు ఎదురైన ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని విజయాలను సాధించారని ప్రధాని కొనియాడారు. దేశ అభివృద్ధికి తమవంతు సహకారం అందించారని తెలిపారు. వారి జీవితాలు మానవ సంకల్పం, ధైర్యసాహసాలకు గొప్ప ఉదాహరణగా నిలిచాయని పేర్కొన్నారు.

#### ఐక్యతతో ముందుకు సాగాలి

దేశంలో సామరస్యం, సోదరభావాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం సమష్టిగా ముందుకు సాగాలని కోరారు. జాతీయ స్ఫూర్తి, సద్భావన, ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. దేశ విభజన అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయినవారిని, తీవ్రంగా నష్టపోయిన ప్రజలను స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 14న 'విభజన విషాదాల స్మృతి దినం'గా నిర్వహిస్తోంది.

### విభజనతోఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

**న్యూఢిల్లీ:** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. విభజనలో నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని కొనియాడారు. విభజన, అనంతర అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి స్మారకార్థం 2021 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 14న పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటి బాధితులు ప్రియమైన వారిని కోల్పోయి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ తిరిగి జీవితాలను నిర్మించుకుని దేశ ప్రగతికి దోహదపడ్డారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుతూ వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు.

## చైనా సుంకాల ఎగవేతకు భారత్ సహకారం

- 40 దేశాలతో డ్రాగన్ 'షాడో నెట్‌వర్క్'
- అమెరికా సంచలన ఆరోపణలు
- సరుకుల అక్రమ రవాణా విలువ 303 బిలియన్ డాలర్లంటూ నివేదిక
- గుర్తించేందుకు 'డిటెక్టివ్ బోర్డర్' పేరుతో ఏఐ టూల్ అభివృద్ధి

**వాషింగ్టన్:** అమెరికా విధిస్తున్న సుంకాలను తప్పించుకునేందుకు చైనాకు భారత్ సహా 40 దేశాలు సహకరిస్తున్నాయని అమెరికా ఆరోపించింది. ఇందుకోసం చైనా 'షాడో నెట్‌వర్క్'ను వినియోగిస్తోందని పేర్కొంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో 'ది గ్రేట్ ట్రాన్స్‌షిప్‌మెంట్ స్కామ్' పేరుతో నివేదికను విడుదల చేశారు. అన్యాయ వాణిజ్య పద్ధతులకు పాల్పడుతున్న దేశాలపై అమెరికా సెక్షన్ 301 కింద సుంకాలు విధిస్తోంది. 2018లో చైనాపైనా ఈ నిబంధన కింద ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి అమెరికా సుంకాలను తప్పించుకునేందుకు చైనా నుంచి ఇతర దేశాల మీదుగా సరుకుల రవాణా పెరిగిందని నివేదిక పేర్కొంది. ఈ అక్రమ రవాణా విలువ 303 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేసింది.

#### దేశంతో పాటు సరుకుల గుర్తింపు మార్పి

చైనా తయారీ వస్తువులను ఇతర దేశాల మీదుగా పంపించి వాటిపై లేబుళ్లు మార్చడం, రీప్యాకేజింగ్ చేయడం, రవాణా మార్గాన్ని మార్చడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అమెరికా ఆరోపించింది. తక్కువ కార్మిక వ్యయాలు, బలహీనమైన కస్టమ్స్ పర్యవేక్షణ, అమెరికా మార్కెట్‌లోకి సులభంగా ప్రవేశించే అవకాశాలు ఉన్న దేశాలను ఇందుకు ఎంచుకుంటున్నట్లు తెలిపింది. దీంతో వాస్తవానికి చైనాలో తయారైన వస్తువులు ఇతర దేశాల్లో తయారైనవిగా కనిపించే అవకాశం ఉంటుందని పేర్కొంది.

#### ఏఐతో అక్రమ సరుకులకు చెక్

చైనాలో తయారైన వస్తువులు ఇతర దేశాల మీదుగా అమెరికాకు చేరుతున్నాయా అనే విషయాన్ని గుర్తించేందుకు 'డిటెక్టివ్ బోర్డర్' పేరుతో ఏఐ ఆధారిత సాధనాన్ని అభివృద్ధి చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. షిప్‌మెంట్ రికార్డులు, రవాణా మార్గాల చరిత్ర, యాజమాన్య సంబంధాలను విశ్లేషించి అనుమానాస్పద సరుకులను గుర్తించేలా ఈ వ్యవస్థను రూపొందించనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

# ప్రతి నీటి బొట్టూ రెడ్‌లైన్!

- 'సింధూ జలాల'పై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కవ్వింపు వ్యాఖ్యలు
- నీటి హక్కులను దెబ్బతీస్తే గట్టిగా బదులిస్తామంటూ హెచ్చరిక

**ఇస్లామాబాద్:** సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై కవ్వింపు వ్యాఖ్యలు చేశారు. సింధూ నదీ జలాల్లో పాకిస్థాన్‌కు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టునూ 'రెడ్‌లైన్'గా పరిగణిస్తామని పేర్కొన్నారు. తమ నీటి హక్కులకు భంగం కలిగించేలా భారత్ ఎలాంటి చర్యలకు పాల్పడినా గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

#### 'బలహీనతగా చూడొద్దు'

పాకిస్థాన్ శాంతిని కోరుకుంటోందని, అయితే దాన్ని తమ బలహీనతగా భావించరాదని షెహబాజ్ అన్నారు. దేశ సార్వభౌమత్వానికి, రక్షణ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 2025 మేలో జరిగిన ఘర్షణల కంటే గట్టిగా బదులిస్తామని వ్యాఖ్యానించారు. భారత్‌తో జరిగిన ఘర్షణల్లో పాకిస్థానే విజయం సాధించిందంటూ ఆయన పేర్కొన్నారు.

### పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఒప్పందం నిలిపివేత

2025 ఏప్రిల్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో 1960లో కుదిరిన సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. ఒప్పందాన్ని పునరుద్ధరించి సింధూ జలాలను విడుదల చేయాలని పాక్ పదేపదే డిమాండ్ చేస్తోంది. అయితే సీమాంతర ఉగ్రవాదానికి స్వస్తి పలికే వరకు ఈ అంశంపై పునరాలోచన ఉండదని భారత్ స్పష్టం చేసింది. 'నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు' అని తేల్చిచెప్పింది. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే అంతర్జాతీయ ఒప్పందంపై సార్వభౌమ దేశంగా తగిన నిర్ణయం తీసుకునే హక్కు తమకు ఉందని భారత్ పేర్కొంది.

# స్పిన్ సవాల్‌కు భారత్ సిద్ధం!

• శ్రీలంకతో నేటి నుంచి తొలి టెస్టు • గంభీర్ రెడ్‌బాల్ వ్యూహానికి కీలక పరీక్ష • గాలేలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్న గిల్ సేన



**గాలే:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌కు భారత్ సిద్ధమైంది. గాలే వేదికగా శనివారం ఉదయం 10 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్వదేశంలో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా చేతుల్లో వరుసగా టెస్టు సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టు.. రెడ్‌బాల్ క్రికెట్‌లో పునరుత్తేజం పొందాలని పట్టుదలగా ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ సిరీస్ కీలకంగా మారింది. గాలే పిచ్‌పై మ్యాచ్ సాగేకొద్దీ సహజంగా పగుళ్లు ఏర్పడి స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉంది. శ్రీలంక ఈ మైదానంలో 1998 నుంచి ఆడిన 49 టెస్టుల్లో 27 విజయాలు సాధించింది. ప్రబాత్ జయసూర్య, రమేశ్ మెండిస్ నేతృత్వంలోని శ్రీలంక స్పిన్ దళం భారత్‌కు పెద్ద సవాల్‌గా నిలవనుంది. ఇటీవల మిచెల్ సాంట్నర్, సైమన్ హార్మర్ వంటి స్పిన్నర్లను ఎదుర్కొన్నప్పుడు భారత బ్యాటర్లు ఇబ్బందులు పడ్డారు. దీంతో గాలేలో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడమే విజయానికి కీలకం కానుంది.

### పంత్, జురెల్‌పై గురి

మధ్యతరగతి బ్యాటర్లలో రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ ఇటీవలి ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. సర్ఫరాజ్ ఖాన్‌పై వీరిద్దరికే తుది జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. శ్రీలంక స్పిన్నర్లను వీరు ఎలా ఎదుర్కొంటారన్నది సిరీస్‌లో కీలకంగా మారనుంది. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్‌తో పాటు మూడో స్థానంలో దేవదత్ పడిక్కల్‌కు అవకాశం దక్కనుంది. సాయి సుదర్శన్ గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చేలోపు మూడో స్థానంపై తన స్థానం సుస్థిరం చేసుకునేందుకు పడిక్కల్‌కు ఇదో మంచి అవకాశం.

### గిల్‌పైనే భారీ ఆశలు

యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భారత బ్యాటింగ్‌కు కీలకంగా మారనున్నాడు. 2017లో విరాట్ కోహ్లీ సారథ్యంలో శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత జట్టు 3–0తో సిరీస్ గెలిచి టెస్టుల్లో ఆధిపత్యానికి బాటలు వేసింది. అదే తరహాలో ప్రస్తుత యువ జట్టు కూడా గాలేలో విజయం సాధించి కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టాలని చూస్తోంది. భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, రవీంద్ర జడేజా తుది జట్టులో ఉండే అవకాశాలున్నాయి. వీరు సరైన లైన్, లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం అత్యంత కీలకం. పేసర్ మహ్మద్ సిరాజ్‌తో పాటు ప్రసిద్ధ్ కృష్ణ కీలక సమయాల్లో వికెట్లు తీయాల్సి ఉంటుంది.

### మ్యాచ్ ప్రాక్టీస్ లేక శ్రీలంక

శ్రీలంక కూడా సుదీర్ఘ విరామం తర్వాత టెస్టు క్రికెట్‌లోకి వస్తోంది. దాదాపు ఏడాది పాటు స్వదేశంలో టెస్టు ఆడని ఆ జట్టు జూన్–జూలైలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఆడింది. ధనంజయ డిసిల్వా నేతృత్వంలోని శ్రీలంక బలమైన భారత జట్టును నిలువరించేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది.

### స్వాతంత్ర్య దినోత్సవాన టెస్టు పోరు

రెండు జట్లూ టెస్టు క్రికెట్‌లో పునరాగమనం కోసం ఎదురుచూస్తున్న వేళ ఈ సిరీస్ ఆసక్తికరంగా మారింది. గాలేలో స్పిన్ సవాల్‌ను అధిగమించి భారత్ శుభారంభం చేస్తుందా.. లేక శ్రీలంక సొంతగడ్డపై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతుందా అన్నది చూడాలి.



# కెప్టెన్సీపై పూర్తి నమ్మకంతో ఉన్నా

• ఏడాది నాయకత్వంలో జట్టు సరైన దిశలోనే పయనిస్తోంది
• డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడమే ప్రధాన లక్ష్యం
• టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్

**గాలే:** భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా తనపై తనకు పూర్తి నమ్మకం ఉందని శుభ్‌మన్ గిల్ తెలిపాడు. గత ఏడాది కాలంలో జట్టు సరైన దిశలో పురోగమిస్తోందని, నాయకత్వ బాధ్యతలను తాను ఆస్వాదిస్తున్నానని చెప్పాడు. శ్రీలంకతో తొలి టెస్టుకు ముందు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గిల్ మాట్లాడాడు. ఇంగ్లాండ్‌తో తొలి సిరీస్‌లో భారత్ 2–2తో డ్రా చేసుకోగా.. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో ఓటమి ఎదురైంది. ఆ సిరీస్‌లో కొంతకాలం గిల్ మెడ గాయం కారణంగా దూరమయ్యాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది. ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే ఏడాది జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాలంటే మిగిలిన సుమారు తొమ్మిది టెస్టుల్లో ఆరు లేదా ఏడు గెలవాల్సి ఉంటుందని గిల్ తెలిపాడు. అందుకే శ్రీలంక సిరీస్ ఎంతో కీలకమని పేర్కొన్నాడు.

శ్రీలంకతో గాలేలో జరిగే మ్యాచ్ భారత్‌కు 600వ టెస్టు. దీంతో మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాల తర్వాత ప్రత్యేక మైలురాయి టెస్టులో భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం గిల్‌కు దక్కుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున 600వ టెస్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం మరింత ప్రత్యేక గౌరవమని గిల్ చెప్పాడు. గిల్ చిన్ననాటి కోచ్ సుఖ్విందర్ టింకూ కూడా అతడి కెప్టెన్సీపై ప్రశంసలు కురిపించాడు. గిల్ ఎప్పుడూ నేర్చుకోవాలనే తపనతో ఉండేవాడని, అందుకే కెప్టెన్‌గా రాణించడం తనకు ఆశ్చర్యం కలిగించలేదని చెప్పాడు.

### గాలే పిచ్‌పై స్పిన్నర్లదే కీలక పాత్ర

శ్రీలంక పరిస్థితులపై టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. భారత్‌లో మాదిరిగానే పాత బంతితో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలిపాడు. గాలే పిచ్‌పై ఇటీవల మ్యాచ్‌ల్లో మంచి బౌన్స్ కనిపించిందని, ఎర్రమట్టి పిచ్‌లతో పోలిక ఉందని చెప్పాడు. ముఖ్యంగా ముంబైలోని పరిస్థితులకు గాలే పిచ్ కొంత దగ్గరగా ఉంటుందని గిల్ వివరించాడు.

# బీసీసీఐ డైరెక్టర్‌గా లక్ష్మణ్?

• కొత్త పదవిలో సీఓఈ అధిపతి
• త్వరలో ముగియనున్న ఒప్పందం
• మరో రెండేళ్లు కొనసాగించాలని భావిస్తున్న బీసీసీఐ



**బెంగళూరు:** భారత మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు బీసీసీఐ మరింత కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) అధిపతిగా ఉన్న లక్ష్మణ్‌ను.. బోర్డు కొత్తగా ప్రవేశపెట్టనున్న 'క్రికెట్ డైరెక్టర్' పదవిలో నియమించే యోచనలో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. సీఓఈ అధిపతిగా లక్ష్మణ్ ఒప్పందం త్వరలో ముగియనుంది. ఆయన సేవలను మరో రెండేళ్లు కొనసాగించాలని భావిస్తున్న బీసీసీఐ.. ఈ కొత్త బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. క్రికెట్ డైరెక్టర్ బాధ్యతలు భారత క్రికెట్‌లోని అన్ని స్థాయిలతోనూ అనుసంధానమై ఉండనున్నాయి. టీమిండియా సీనియర్ జట్టు, సెలక్టర్లు, కోచ్‌లు, సీఓఈ మధ్య సమన్వయం చేయడం ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ప్రతిభావంతులను గుర్తించడం, వారికి శిక్షణ అందించడం, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించడం, ఆటగాళ్ల గాయాల నిర్వహణ వంటి సీఓఈ బాధ్యతలకు అదనంగా ఈ పదవిలో మరిన్ని కీలక బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

### యువతకు లక్ష్మణ్ అండ

2024లో సీఓఈ అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణ్.. యువ ఆటగాళ్లను జాతీయ జట్టుకు తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ప్రధాన కోచ్ గైర్హాజరైన సందర్భాల్లో టీమిండియా సీనియర్ జట్టుకు తాత్కాలిక కోచ్‌గా కూడా వ్యవహరించారు. దీంతో కొత్త బాధ్యతలకు లక్ష్మణ్ సరైన వ్యక్తి అని బీసీసీఐ భావిస్తున్నట్లు సమాచారం.

### అగార్కర్ పదవీకాలంపైనా ఉత్కంఠ

మరోవైపు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ఈ సెప్టెంబరులో ముగియనుంది. గత కొన్ని నెలలుగా ఆయన పనితీరుపై చర్చ జరుగుతోంది. 2027 వన్డే ప్రపంచకప్ వరకు అగార్కర్ పదవీకాలాన్ని పొడిగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పైనా విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. బీసీసీఐ ప్రతిపాదిస్తున్న క్రికెట్ డైరెక్టర్ పదవి టీమిండియా వ్యవహారాల్లో ఎలాంటి మార్పులు తీసుకురాబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆసియా కప్, క్రీడలకు జెమీమా దూరం

**న్యూఢిల్లీ:** భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ఆసియా కప్, ఆసియా క్రీడలకు దూరమైంది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' టోర్నీలో ఆడుతున్న సమయంలో ఈ నెల 3న ఆమె కుడి హ్యామ్‌స్ట్రింగ్‌కు గాయమైంది. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో వైద్య బృందం పరీక్షించగా తీవ్రస్థాయి (హైగ్రేడ్) టియర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్‌లో జరిగే మహిళల ఆసియా కప్‌కు జెమీమా స్థానంలో ప్రతికా రావల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచి–నగోయాలో ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఈ రెండు మెగా ఈవెంట్లకూ జెమీమా అందుబాటులో ఉండదని బీసీసీఐ వెల్లడించింది.




# చమురు సెగ.. మార్కెట్లకు నష్టాలు

## వరుసగా నాలుగో రోజూ పడిపోయిన నిఫ్టీ

• భౌగోళిక ఉద్రిక్తతలతో మదుపర్ల అప్రమత్తం • 70పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. 29 పాయింట్లు తగ్గిన నిఫ్టీ




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. పెరుగుతున్న ముడిచమురు ధరలు, అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన, హార్ముజ్ జలసంధిపై అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ 70.71 పాయింట్లు (0.09%) తగ్గి 78,009.25 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 395.59 పాయింట్లు నష్టపోయి 77,684.37కి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 29.85 పాయింట్లు (0.12%) తగ్గి 24,366 వద్ద ముగిసింది. వారంవారీగా సెన్సెక్స్ 489.92 పాయింట్లు, నిఫ్టీ 204.65 పాయింట్లు కోల్పోయాయి. బ్రెంట్ క్రూడ్ ధర 0.17 శాతం పెరిగి బ్యారెల్‌కు 87.15 డాలర్లకు చేరింది. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, వాల్‌స్ట్రీట్ రికార్డు ముగింపులు సానుకూల సంకేతాలిచ్చినా.. ముడిచమురు ధరలు, అమెరికా–ఇరాన్ మధ్య దౌత్యపరమైన పురోగతి లేకపోవడం మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఏషియన్ పెయింట్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, ఎస్‌బీఐ, హెచ్‌సీఎల్ టెక్ నష్టపోయాయి. భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటన్ లాభపడ్డాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ 0.65%, మిడ్‌క్యాప్ సెలెక్ట్ 0.13% తగ్గాయి. హౌసింగ్ ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంకులు, చమురు–గ్యాస్, ఎనర్జీ రంగాలు నష్టపోగా.. హాస్పిటల్స్ 1.49%, టెలికమ్యూనికేషన్ 0.86% లాభపడ్డాయి.

# భారత పర్యటనలో టెవోల్డే

• ఢిల్లీ, ముంబైలో ఎయిర్‌లైన్, టాటా గ్రూప్ ఉన్నతాధికారులతో భేటీ
• వచ్చే నెలలో ఎయిరిండియా సీఈఓ, ఎండీగా బాధ్యతల స్వీకరణ



**న్యూఢిల్లీ:** ఎయిరిండియా నూతన సీఈఓ, ఎండీగా వచ్చే నెలలో బాధ్యతలు చేపట్టనున్న టెవోల్డే గెబ్రెమరియమ్ భారత్‌లో తొలిసారి పర్యటించారు. ఢిల్లీ, ముంబైల్లో ఎయిరిండియా, టాటా గ్రూప్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తున్న సంస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్న సమయంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ మాజీ సీఈఓ అయిన గెబ్రెమరియమ్‌కు దాదాపు 40ఏళ్ల విమానయాన రంగ అనుభవం ఉంది. 11ఏళ్లకుపైగా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సీఈఓగా పనిచేశారు. ప్రస్తుతం డెల్టా ఎయిర్‌లైన్స్, ఐఎఫ్‌సీ/వరల్డ్ బ్యాంక్ గ్రూప్‌లకు సీనియర్ స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా ఉన్నారు. ఆగస్టు 5న ఆయన నియామకాన్ని ఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో బాధ్య తలు చేపట్టనున్నారు. 2022 జనవరిలో టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను కేంద్రం నుంచి కొనుగోలు చేయగా, అనంతరం సింగపూర్ ఎయిర్‌లైన్స్ 25.1 శాతం వాటా తీసుకుంది.

# ఏఎంసీఏకు స్వదేశీ కంబాట్ ఇంజిన్

• రిలయన్స్–రోల్స్ రాయిస్ భాగస్వామ్యం
• భారత్‌లో ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్ ఏర్పాటుకు యోచన
• డిజైన్ నుంచి తయారీ, పరీక్షలు, నిర్వహణ వరకు అన్నీ స్వదేశంలోనే




**న్యూఢిల్లీ:** ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) కోసం స్వదేశీ కంబాట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్రిటన్‌కు చెందిన రోల్స్ రాయిస్ భాగస్వామ్యం కానున్నాయి. భారత్‌లో ప్రత్యేక ఏరోస్పేస్ గ్యాస్ టర్బైన్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించనున్నట్లు శుక్రవారం ప్రకటించాయి. రోల్స్ రాయిస్ ఇంజిన్ సాంకేతికత, నైపుణ్యాన్ని రిలయన్స్ తయారీ, సాంకేతిక, అమలు సామర్థ్యాలతో మేళవించనున్నాయి. ప్రతిపాదిత కాంప్లెక్స్‌లో కంబాట్ ఇంజిన్ల డిజైన్, అభివృద్ధి, తయారీ, పరీక్షలు, ఉత్పత్తి, జీవితకాల నిర్వహణ వరకు పూర్తి సామర్థ్యాలను భారత్‌లో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కీలక రక్షణ సాంకేతికతల్లో భారత్ స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తెలిపారు. ఈ భాగస్వామ్యం స్వయం సమృద్ధ ఏరోస్పేస్ వ్యవస్థ నిర్మాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని రోల్స్ రాయిస్ సీఈవో టుఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్ పేర్కొన్నారు. ఏఎంసీఏ భారత్ చేపడుతున్న ఐదో తరం స్టెల్త్ ఫైటర్ కార్యక్రమం. దానికి దేశీయ ఇంజిన్ అభివృద్ధి చేయడం చాలాకాలంగా రక్షణ రంగం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ప్రస్తుత ప్రకటన తుది జాయింట్ వెంచర్ లేదా ఒప్పందం కాదు. కాంప్లెక్స్ ఏర్పాటుపై పరిశీలన దశలోనే ఉంది. పెట్టుబడి, యాజమాన్య వాటా, కాలపరిమితిపై వివరాలు వెల్లడించలేదు. రక్షణతో పాటు పౌర విమానయానం, కొత్త పవర్, ప్రొపల్షన్ వ్యవస్థల్లోనూ భవిష్యత్తులో సహకారం విస్తరించే అవకాశముందని సంస్థలు తెలిపాయి.

# బీఎస్ఎన్ఎల్ కొత్త ఆఫర్లు

• జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లో మరో 602 స్వదేశీ 4జీ బీటీఎస్‌లు
• రూ.1కే 1 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత కాల్స్
• రూ.2,399 ప్లాన్‌పై అదనంగా 47 రోజుల వ్యాలిడిటీ
• రూ.1,111కే 200 ఎంబీపీఎస్ ఫైబర్.. 25కుపైగా ఓటీటీలు

**జమ్మూ:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ పలు కొత్త డిజిటల్ సేవలు, ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌లో అదనంగా 602 స్వదేశీ 4జీ బీటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు జమ్మూ కశ్మీర్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ కుష్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ప్రణాళికలోని 2,247 బీటీఎస్‌లలో 1,757 జమ్మూ కశ్మీర్‌లో, 343 లద్దాఖ్‌లో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. నెట్‌వర్క్‌ను 5జీకి అప్‌గ్రేడ్ చేసేలా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.




### రూ.1కే 'ఫ్రీడమ్ 2.0'

కొత్త వినియోగదారులకు 'రూ.1 ఫ్రీడమ్ 2.0' ఆఫర్‌లో రోజుకు 1 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత కాల్స్ 24 రోజులపాటు అందనున్నాయి. రూ.2,399 వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌పై అదనంగా 47 రోజుల వ్యాలిడిటీతో మొత్తం 412 రోజులకు పెంచారు. 'ఫైబర్ ఫ్రీడమ్' ప్లాన్‌ను రూ.1,111కే అందిస్తూ 200 ఎంబీపీఎస్ వరకు వేగం, 5,000 జీబీ నెలవారీ డేటా, 25కుపైగా ఓటీటీ ప్లాట్‌ఫాంలను కల్పిస్తున్నారు.

కొత్త బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో రీచార్జ్‌లు, బిల్లులు, ఫిర్యాదుల నమోదు–ట్రాకింగ్, డీఎన్‌డీ, ఫైబర్ బుకింగ్, ఏఐ చాట్‌బాట్, వాయిస్ సెర్చ్, బహుళ ఖాతాల నిర్వహణ వంటి సదుపాయాలు ఉన్నాయి. టాంగో టీవీ ద్వారా సుమారు 500 లైవ్ టీవీ ఛానళ్లను ఉచితం గా వీక్షించవచ్చు. సాధారణ నెట్‌వర్క్ లేని మారుమూల ప్రాంతాల కోసం గ్లోబల్ శాటిలైట్ ఫోన్ సేవలను కూడా ప్రకటించింది. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పాలీక్యాబ్‌తో కలిసి దేశంలో కెమెరాలు, ఓఎన్‌టీలు, రౌటర్లు వంటి టెలికాం పరికరాల తయారీ చేపట్టనున్నట్లు బీఎస్ఎన్ఎల్ తెలిపింది.

# ఆదిత్య బిర్లా బ్రాండ్‌కు ఇక రాయల్టీ

• జూన్ 1 నుంచి గ్రూప్ కంపెనీలపై అమలు
• ఆదాయంపై 0.25 శాతం.. గరిష్ఠంగా రూ.225 కోట్లు
• గ్రాసిమ్, హిండాల్కోకు వర్తింపు • నష్టాల్లో ఉన్న ఏడాదికి మినహాయింపు




**న్యూఢిల్లీ:** ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీలు గ్రూప్ బ్రాండ్ పేరును వినియోగించినందుకు జూన్ 1 నుంచి బిర్లా గ్రూప్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బీజీహెచ్‌పీఎల్)కు రాయల్టీ చెల్లించనున్నాయి. స్టాండలోన్ ఆదాయంపై 0.25 శాతం చొప్పున రాయల్టీ ఉంటుంది. ఒక్కో కంపెనీకి గరిష్ఠంగా రూ.225 కోట్లకు పరిమితం చేశారు. ఏ ఆర్థిక సంవత్సరం లోనైనా సమీకృత ప్రీ–ట్యాక్స్ లాభం ప్రతికూలంగా ఉంటే ఆ ఏడాదికి రాయల్టీ ఉండదు. బ్రాండ్ యాజమాన్యం బీజీహెచ్‌పీఎల్‌దేనని, అన్ని కంపెనీలు మేధో సంపత్తి లైసెన్స్ ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుందని గ్రాసిమ్, హిండాల్కో ఉన్నతాధికారులు తెలిపారు. ఆదిత్య బిర్లా బ్రాండ్ గ్రూప్‌లో అత్యంత విలువైన ఆస్తుల్లో ఒకటని, సంస్థల వృద్ధికి పోటీ ప్రయోజనాన్ని అందిస్తుందని గ్రాసిమ్ అధికారులు తెలిపారు. ఇన్నాళ్లూ కుటుంబం నుంచి ఉచితంగా లభించిన బ్రాండ్ వినియోగానికి ఇప్పుడు ప్రపంచ స్థాయి సంస్థల తరహాలో క్రమబద్ధమైన పాలనా విధానంలో భాగంగా రాయల్టీ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రాసిమ్‌కు దీని ప్రభావం సుమారు రూ.100 కోట్లుగా ఉండొచ్చని సీఎఫ్ఓ హేమంత్ కడెల్ తెలిపారు. హిండాల్కో కూడా 0.25 శాతం రాయల్టీని, రూ.225 కోట్ల గరిష్ఠ పరిమితితో చెల్లించనుంది. అమెరికా అనుబంధ సంస్థ నోవెలిస్ ఇప్పటికే ఈ ఏర్పాటును వెల్లడించింది. సెబీ నిబంధనల మేరకు హిండాల్కో సంబంధిత పార్టీ లావాదేవీని అక్టోబర్‌లో వెల్లడించనుంది. రూ.72 బిలియన్ల ఆదిత్య బిర్లా గ్రూప్ 41 దేశాల్లో సిమెంట్, లోహాలు, ఫ్యాషన్, ఆర్థిక సేవలు తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు



అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివర అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై డా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివర ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు డా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై డా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో



మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించ నున్నా రన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాక్ డా ఓ కీలక పాత్రని పోషిస్తున్న ట్టు సమాచారం. 'రాకా' ప్రపంచం పైనా, ఇందులోని పాత్రల పైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

## మళయాళంలోనూ ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీ వసంత్



ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటి కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక పాన్–ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక్–టు–బ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇది గనుక అధికారికంగా ఖరారైతే రామ్ చరణ్ ? రుక్మిణీల ఫస్ట్ కాంబినేషన్‌గా ఇది సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయం. భాషతో సంబంధం లేకుండా లక్కీ చార్మ్‌గా మారిన రుక్మిణీ వసంత్ రాబోయే రోజుల్లో సౌత్ లేడీ సూపర్ స్టార్‌గా నిలిచినా ఆశ్చర్యం లేదంటున్నారు సినీ విశ్లేషకులు.

## లోశ్ కనగరాజ్ చిత్రం
# 'డీసీ'కి పెరుగుతున్న కలెక్షన్లు



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోష్ కనగరాజ్

హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు డా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. వలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'లీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## అతిగా ఫోన్ వాడకంతో
# 3 లక్షలు ఖర్చు



ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో డా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందు శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.

# సినీ లవర్స్‌కు పండగే పండగ

పంద్రాగస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్ను, వాసవి గణేశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు. ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటి విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా నటన అలరిస్తోంది. ఇమ్రాన్ ఇందులో శివవ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.

# అలా.. రజనీకాంత్‌తో జతకట్టా



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రీయా శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రీయా కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్ని శ్రీయా తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ.. ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన సరే అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో–స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

## రజనీకాంత్ ధర్మన్ మూవీ
# సెకండ్ షెడ్యూల్ ప్రారంభం

సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన



సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివర విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

# సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్

'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి డా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, వలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.


Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.